ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 25 అక్టోబరు 2025 | 5



తనిఖీ చేస్తున్న లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో..

ముగ్గురు ఉమ్మడి జిల్లావాసులు

రావులపాలేనికి చెందిన క్రేన్ ఆపరేటర్ మృతి

బిక్కవోలు, కాకినాడకు చెందిన ఇద్దరు సురక్షితం



మృతుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (ఫైల్)

రావులపాలెం/ అనపర్తి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో గురువారం అర్ధరాత్రి జరిగిన కావేరి బస్సు దగ్ధం ఘటనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు చిక్కుకున్నారు. వీరిలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(39) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. క్రేన్ పని నిమిత్తం రెండు రోజుల కిందట ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లాడు. బెంగళూరులో వేరే పని ఉండడంతో గురువారం రాత్రి కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. ఈ దుర్ఘటనలో శ్రీనివాసరెడ్డి అగ్నికి ఆహుతై మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీజ్యోతి, 8వ తరగతి చదువుతున్న కుమారుడు వెంకటరెడ్డి, 3వ తరగతి చదువుతున్న కుమార్తె దివ్య ఉన్నారు. మృతుడి తండ్రి, మావయ్య కూడా అతడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇదే దుర్ఘటనలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన మల్లిడి గంగాధర రామారెడ్డి తృటిలో తప్పించుకుని మృత్యుంజయుడిగా నిలిచాడు. అనపర్తిలోని ఎంఎస్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మల్లిడి నారాయణరెడ్డి కుమారుడైన రామారెడ్డి తన కుమార్తె చదువు కోసం బెంగళూరులో ఉంటున్నాడు. ఆయన వ్యాపార రీత్యా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరచూ ప్రయాణిస్తుంటాడు. శుక్రవారం తన పుట్టినరోజు కావడంతో ఎట్టిపరిస్థితిలోను బెంగళూరు వెళ్లాలనుకుని గురువారం రాత్రి అప్పటికప్పుడు బస్సు టికెట్ తీసుకుని బయలుదేరాడు. చివరి నిమిషంలో టికెట్ దొరకడంతో ఆఖరి వరుసలో సీటు దొరికింది. చివరికి అదే ఆయన ప్రాణాలు కాపాడింది. పక్క ప్రయాణికులు పగలగొట్టిన ఎమర్జెన్సీ డోరు నుంచి కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నానని మల్లిడి గంగాధర రామారెడ్డి ఫోన్‌లో ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇదే ఘటనలో బయటపడిన కాకినాడకు చెందిన జి.సత్యనారాయణ ప్రస్తుతం కర్నూలులోని ఆకాశ్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.



మల్లిడి గంగాధర రామారెడ్డి క్షతగాత్రుడు

రాయవరం బాధితులకు చెక్కుల పంపిణీ

- ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుంది : మంత్రి సుభాష్
- చెక్కులు పంపిణీ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం
- యజమాని తరపున ఒక్కొక్కరికి 2.50 లక్షలు అందజేత

6

'ఎంఆర్‌పీకి మించి అమ్మితే చర్యలు'

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు ఎంఆర్‌పీకి మించి ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్టాల్స్‌లో ఎంఆర్‌పీకి మించి విక్రయాలు చేస్తున్నట్టు సమాచారం అందడంతో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావుతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో ఎంఆర్‌పీకి మించి ధరలకు అమ్ముతున్న స్టాల్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ లీగల్ అండ్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరామ్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాపారస్తులు ఏ వస్తువునైనా ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. ఎంఆర్‌పీ ధరలకు మించి వ్యాపారాలు అమ్మకాలు చేస్తే రాజమహేంద్రవరం గానుగవీధిలో ఉన్న జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులకు సూచించారు. అనంతరరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారులు ధైర్యంగా ప్రశ్నించి మోసాలను అరికట్టాలని కోరారు. కొనుగోలు సమయంలో వస్తువు ఎమ్మార్పీ తయారీ, గడువు తేదీలు తయారి సంస్థ చిరునామా వంటి వివరాలు సరిచూసుకోవాలన్నారు. మోసపోతే వినియోగదారుల కమిషన్‌లో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.

బాబోయ్.. బస్!



హైదరాబాద్, బెంగళూరు, చెన్నై.. ఎక్కడికైనా వెళ్లాలా? ఠక్కున ఆన్‌లైన్ ఓపెన్ చేయగానే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల లిస్టు ప్రత్యక్షమవుతుంది. ప్రయాణికులు ఒక్క క్లిక్‌తో సీటు లేదా బెర్త్ బుక్ చేసేసుకుంటున్నారు. తీరా బస్సు ఎక్కిన తర్వాత ఇరుకు సీట్లు, అటు ఇటు కదిలే చోటుండదు. మధ్యలో ఉన్న దారి కుచించుకుపోయి ఉంటుంది. ఎవరైనా ఒక బ్యాగ్ ఆ దారిలో పెడితే ఇక అంతే.. దానిపై నుంచి దూకాల్సిందే. అత్యవసర ద్వారం ఎక్కడ ఉందో వెతుక్కునే లోపుగా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా.. జనం ప్రాణాలు పోతున్నా ప్రైవేటు ట్రావెల్స్(కాంట్రాక్ట్ క్యారియర్స్) బస్సుల తీరు మాత్రం మారడం లేదు. ఆకర్షణీయమైన రంగులు, హంగులకు ప్రాధాన్యం ఇస్తూ భద్రతను గాలికొదిలేస్తున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో కర్నూలు వద్ద శుక్రవారం మంటలు చెలరేగి పలువురు సజీవదహనమైన సంఘటనతో జనం ఉలిక్కిపడ్డారు. ఒక బైక్ ఢీకొంటే బస్సు మొత్తం తగలబడిపోయేంత నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులని బలైపోయిన ప్రాణాలు మౌనంగా ప్రశ్నిస్తున్నాయి.

- ప్రమాదకరంగా ప్రైవేటు బస్సుల ప్రయాణం
- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
- నిబంధనలు విస్మరిస్తున్న ట్రావెల్స్ యాజమాన్యాలు
- రికార్డులు పరిశీలించి చేతులు దులుపుకొంటున్న రవాణాశాఖ
- ప్రయాణికుల భద్రత విషయంలో చర్యలు శూన్యం
- రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ ఇతర రాష్ట్రాల్లో..
- అనధికారికంగా స్లీపర్లు ఏర్పాటు
- అనుభవం లేని డ్రైవర్లు

(ఆంధ్రజ్యోతి - రాజమహేంద్రవరం/కాకినాడ/ అమలాపురం)

రైళ్లలో రిజర్వేషన్ దొరకడం గగనమైపోయింది. ఆర్టీసీ ట్రావెల్ బస్సులూ అరకొరే. దీంతో ప్రైవేటు ట్రావెల్ బస్సులే చాలామందికి దిక్కు. పైగా టిక్కెట్ ఆన్‌లైన్ ద్వారా ఒక్క క్లిక్‌తో పొందొచ్చు. ఇదివరకు ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఏసీ, నాన్ ఏసీ పేరిట నడిచేవి. అన్నీ సీట్లే. ప్రస్తుతం వాటి స్థానంలో స్లీపర్ కోచ్‌ల హవా నడుస్తోంది. 40 సీట్ల వరకు ఉంటున్నాయి. ఇక స్లీపర్ బస్సుల్లో 2బై1 సీటింగ్ ఉంటుంది. 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీయాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరడుగుల పొడవు, 2.6 అడుగుల వెడల్పుతో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీ ఒక మనిషి మాత్రమే వెళ్లేలా చాలా ఇరుకుగా ఉంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకు ప్రాంతం నుంచి బయటకు రావడం దాదాపు అసాధ్యం. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ మంది లోపల చిక్కుకుపోతున్నారు. స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్య. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఒకవైపునకు ఒరిగితే ప్రయాణికులు కిటికీలను, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టమవుతోంది. సాధారణంగా 300 నుంచి వెయ్యి కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. ఈ బస్సుల్లో రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట, మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటుంది. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా వాటి పనితీరు సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవింగ్ సమయంలో అర్ధరాత్రి తర్వాత నుంచి తెల్లవారుజాములోపు కొందరు నిద్రలోకి జారుతున్నారు.

● అంతా ప్రైవేటు బస్సుల హవాయే..

● తూర్పుగోదావరి జిల్లాలో.. రోజూ 30 బస్సుల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ తిరుగుతున్నాయి. వీటిలో హైదరాబాద్ సర్వీసులు ఎక్కువ. విశాఖ, బెంగళూరు సర్వీసులూ ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచీ ఇప్పటివరకూ రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలుచేసి 218 కేసులు రాసి రూ.18 లక్షలు జరిమానా వసూలు చేశారు. ఒక బస్సుకు ఏకంగా రూ.6 లక్షలు ఫైన్ వేశారు. పన్ను చెల్లించ కుండా తిరిగేస్తున్న 9 బస్సులను సీజ్ చేశారు. ఫైర్ ఎగ్జిస్టింగ్విషర్లు లేకపోవడంతో 85, సీట్లు ఆల్ట్రేషన్ చేసినవి 42 కేసులు రాశారు.

● కాకినాడ జిల్లాలో.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు సుమారు 30కిపైగా బస్సులు వెళుతుంటాయి. సీజనల్‌గా వీటి సంఖ్య మారుతుంటుంది. దాదాపుగా ఈ ప్రైవేటు బస్సులన్నీ స్టేజ్ క్యారియర్లుగానే తిరుగుతున్నాయి.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో.. నిత్యం 30కు పైగా బస్సులు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వెళుతుంటాయి. స్లీపర్‌కు డిమాండ్ పెరగడంతో వారు ఆడింది ఆట, పెట్టిందే రేటుగా దోచుకుంటున్నారు. ట్రావెల్స్ బస్సులు విపరీతమైన వేగంతో నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

● ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు

గతంలో ఏ రాష్ట్రంలోని వాహనాలు అదే రాష్ట్రంలో రిజిస్ట్రేషను చేయించుకోవడం జరిగేది. కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా పర్మిట్(ఏఐపీ) వాహనాలు ఏ రాష్ట్రంలోనైనా రిజిస్ట్రేషను చేయించుకోవచ్చని వెసులుబాటు ఇవ్వడంతో అప్పటి నుంచీ నెంబరు ప్లేటుపై ఏపీ తగ్గిపోయి ఏఆర్, డీడీ వంటివి కనిపిస్తున్నాయి. మన రాష్ట్రంలో ఒక్కో సీటుకు రూ.3,750 చొప్పున ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లించాలి. అంటే 40 సీట్లు ఉన్న బస్సుకు సుమారు రూ.1.50 లక్షలు చెల్లించాలి. అంటే ఏడాదికి రూ.6 లక్షలు. అదే ఈశాన్య రాష్ట్రాలతోపాటు డామన్‌డయ్యూలో అయితే దీనిలో నాలుగో వంతు చెల్లిస్తే సరిపోతుంది. దీంతో ఇతర రాష్ట్రాల్లో పర్మిట్లు తీసుకొని ఇక్కడ తిప్పుతున్నారు. చాలా రాష్ట్రాలు పర్మిట్ ఫీజు తగ్గించినా మన రాష్ట్రంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాహన సామర్థ్యం (ఫిట్‌నెస్/బ్రేక్) విషయంలోనూ గజిబిజే. ఎక్కడ రిజిస్ట్రేషను చేయించుకుంటే అక్కడే ఈ తనిఖీలు చేసి సర్టిఫికెట్ జారీచేస్తారు. ఇవి కూడా చాలావరకు సృష్టించుకున్నవే.



కాకినాడలో ఓ బస్సుకు ఉన్న ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్

● నిబంధనలు గాలికి..

పర్మిట్ ఇచ్చినప్పుడు ఎన్ని సీట్లు, ఎన్ని స్లీపర్లు వంటివి పొందుపరుస్తారు. కానీ చాలా బస్సుల్లో వీటి ఉల్లంఘన జరుగుతోంది. డ్రైవరు వెనుక జాగాను కూడా వదిలిపెట్టడంలేదు. ఒక్కో బస్సులో రెండు మూడు సీట్లు అనధికారికంగా ఆల్ట్రేషన్ చేయించుకొని ఏర్పాటుచేస్తున్నారు. ఒక్క సీటు అదనంగా వేసుకున్నా రోజుకు రూ.3-4వేల వరకూ గిట్టుబాటు అవుతుంది. సీట్లను స్లీపర్లుగా అనధికారికంగా మార్పులు చేస్తున్నారు. కర్నూలులో ఘోర అగ్ని ప్రమాదానికి గురైన బస్సు కూడా సీట్ పర్మిషన్ ఉండగా, స్లీపర్‌గా మార్చినట్టు చెబుతున్నారు. అయినా వీటిపై అధికారులు దృష్టి సారించలేదు. దాదాపుగా అన్ని బస్సులకు స్లీపర్ సౌలభ్యం ఉంటోంది. వీటిలో ఎన్నింటికి అనుమతులున్నాయో తెలియని పరిస్థితి ఉంది. అత్యవసర ద్వారా కనబడకుండా ఏదోవిధంగా మూసేస్తున్నారు. దీంతో అత్యవసర సమయంలో ముందర భాగంలో ఉన్న ఒకే ద్వారం గుండా దిగాల్సి రావడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. ఏసీ బస్సుల్లో అత్యవసర సమయంలో అద్దంబద్దలు కొట్టడానికి సుత్తి ఉండాలి. కానీ అది సుత్తిమాటగానే పట్టించుకోవడం లేదు. ఇక డ్రైవర్లకు అనుభవం ఉందా? అంటే సందేహమనే సమాధానం వినవస్తోంది. ఒక్కో బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఒక క్లీనరు ఉంటారు. సగం దూరం ఒకరు నడిపితే, మరొక సగం దూరం మరొకరు నడపాలి. కానీ అదీ అమలు కాదు. క్లీనరుకు బస్సు డ్రైవింగ్ అలవాటు చేయడం కోసం డ్రైవింగ్ సీట్లో కూర్చోబెడుతున్నారు. కొందరు డ్రైవర్లు సిటీలు దాటిన తర్వాత మద్యం సేవిస్తున్నారు. అలాగే పగలు మద్యం తాగడంతో ఆ మగతతోనే రాత్రి బస్సును తీస్తున్నారు. ఉదాహరణకు బస్సు ఉదయం హైదరాబాద్ చేరిన తర్వాత పార్కింగ్ చేస్తారు. అక్కడ వంట చేసుకొంటారు. ఈ క్రమంలో కొందరు మద్యం తాగడం తప్పనిసరిగా మారింది. ఆ మత్తు దిగకుండానే రాత్రి తిరుగు పయనమవుతున్నారు. అడుగడుగునా తనిఖీలు చేయడానికి వీలుపడదు. అదే ఆసరాగా ఇష్టానుసారం తంతు కొనసాగిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో భద్రతాపరమైన ఉల్లంఘనలు తీవ్రంగా జరుగుతున్నాయి. బస్సుల్లో సరుకులు ఏమేమి రవాణా చేస్తున్నారో కూడా పట్టించుకొనే నాథుడు ఉండడు. చాలా బస్సులు లారీల మాదిరిగా సరుకు రవాణా చేస్తున్నాయి. ఫైర్ అలారం, ఫైర్ ఎగ్జిస్టింగ్విషర్లు (అగ్నిమాపక సిలిండర్లు) ఉండనే ఉండవు. సీట్ల ఆల్ట్రేషన్ ఎక్కువగా జరుగుతోంది.

● అధికారులేమంటున్నారంటే..

కాకినాడ జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తున్నామని కాకినాడ రవాణాశాఖ ఉపకమిషనర్ శ్రీధర్ చెప్పారు. ప్రజలు కూడా ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉందా? లేదా అనేది అవగాహనతో ఉండాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ అన్ని బస్సుల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని, సిట్టింగ్ ఆల్ట్రేషన్ చేయకూడదని, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో సోదాలు చేయడానికి చర్యలు తీసుకున్నామని 'ఆంధ్రజ్యోతి'తో చెప్పారు.



గోదావరి పుష్కర ప్రణాళిక సన్నద్ధతపై అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి.. పక్కన ఎస్పీ, కమిషనర్.. హాజరైన అధికారులు

2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడానికి సమగ్ర కార్యాచరణ అవసరం. దీనికి అన్ని శాఖల సమన్వయంతో అందరూ కలసి పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె గోదావరి పుష్కరాలకు సంబంధించిన ప్రణాళికలు, సన్నద్ధతపై సమీక్షించారు. పోలీసు, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో పుష్కరాల నేపథ్యంలో చేపట్టనున్న ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గత పుష్కరాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వచ్చే పుష్కరాల మరింత విజయవంతంచేయాలన్నారు. ఆరుకోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయనున్నారనే అంచనా ఉండడం వల్ల మౌలిక సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్, రవాణా వ్యవస్థ, వసతి, ఆహారం, వైద్య సేవలు, స్వచ్ఛత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె ఆదేశించారు. ట్రాఫిక్, క్రౌడ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ వంటి వాటిపై పోలీసుశాఖ రూపొందించిన ప్రణాళికలను మరింత శాస్త్రీయంగా అమలుచేయాలని సూచించారు. పుష్కరాల దృష్ట్యా పట్టణంలోని సుమారు 25 ప్రధాన రోడ్ల విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయని, వీటిలో తూర్పు రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టు, కాతేరు, మోరంపూడి నుంచి సరస్వతి ఘాట్ రోడ్డు, కోటిలింగాలఘాట్ రోడ్డు మార్గాల విస్తరించి ట్రాఫిక్ సమస్యలేకుండా భక్తుల రాకపోకలు సులభతరం చేయవచ్చన్నారు. రాజమహేంద్రవరం నగరంలోని ఖాళీ స్థలాలను గుర్తించి పార్కింగ్ జోన్లు, తాత్కాలిక వసతి గృహాలు, ఆహార పంపిణీ కేంద్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నగరంలో 34 ఘాట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో 31 ఘాట్లు కలిపి మొత్తం 65 గోదావరిఘాట్లు ఉన్నాయని, ఇవి 2.7 కిలోమీటర్ల మేర ఉన్నాయన్నారు. కొత్తగా 1.95 కిలోమీటర్ల మేర ఘాట్లను విస్తరించడం, నిర్మించడం ద్వారా మొత్తం 4.7కిలోమీటర్ల మేర ఘాట్లను అందుబాటులోకి తేనున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం నుంచి సీతానగరం వరకూ గోదావరి ఫ్లడ్ బ్యాంక్ రహదారి అభివృద్ధి చేయడం ద్వారా రాజమండ్రిలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని ఇరిగేషన్ అధికారులు వివరించారు. పుష్కరాలు వర్షాకాలంలో జరిగే అవకాశం ఉన్నందు వల్ల వరదల ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ సిస్టమ్, ఘాట్ల స్థిరత్వం, భక్తుల భద్రత వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, మున్సిపల్ నగర కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఆర్డీవోలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణనాయక్, ఆర్ఎంసీ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌తోపాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి

4 లారీలు సీజ్

కొవ్వూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక మార్గదర్శకాలను ఉల్లంఘించిన, పరిమితికి మించి ఇసుక రవాణా చేసినవారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు దొండగుంట రేవు డీసిల్టేషన్ ఇసుకర్యాంపులో మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికిమించి అధికలోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలను గుర్తించి సీజ్ చేసి కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన పబ్బతిరెడ్డి సుధీర్‌రెడ్డి మూడు లారీల్లో (ఒక్కొక్క లారీలో 36 టన్నులు) ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. దొండగుంట ర్యాంపు నుంచి రాజవరం పేరుతో ఇసుక రవాణా చేస్తున్న మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి.జ్యోతిర్మయి, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కడియం ఆవలో వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్, సిబ్బంది

నేలనంటిన వరి చేలు

వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు

అనపర్తి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు, ఈదురు గాలులకు అనపర్తి మండలంలో సుమారు 500 ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని ఏవో సురేష్ తెలిపారు. మండలంలో 8,900 ఎకరాల్లో వరి పంట వేశారని... కొన్నిచోట్ల ప్రస్తుతం గాలులు ఎక్కువగా ఉండడంతో వరి పనలు నేలకొరుగుతున్నాయని ఆయన తెలిపారు. గింజ పూర్తిగా నీటిలో ఉంటే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నాలుగైదు మొనలను ఒక్కటిగా చేసి నిలబెట్టి కట్టుకోవాలని ఆయన సూచించారు. గట్టిపడిన గింజ ఎక్కువ రోజులు నీటిలో నానితే రంగు మారే ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటిస్తే నష్టం ఉండదని అన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలంటూ రైతుల వినతిపత్రం

బిక్కవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా బిక్కవోలులో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపంట నేలకొరిగింది. పదిరోజుల్లో పంట చేతికొస్తుందన్న తరుణంలో వరి చేలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం మొత్తం మీద తొలకరిలో 15వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ఈ అకాల వర్షాలకు రెండు వేల ఎకరాలకు పైగా వరిపంట నేలకొరగడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. ఇంకో రెండు రోజులు ఇదే మాదిరిగా వర్షాలు కురిస్తే పొలంలోను వరి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు శుక్రవారం తమ పంటకు నష్టపరిహారం అందజేయాలంటూ కూటమి నేతలతో కలసి తహశీల్దార్ సత్యకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొరైల త్రిమూర్తులు, రైతులు వల్లూరి రామకృష్ణచౌదరి, దాసరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి ఎన్ శామ్యూల్‌జాన్‌ను వివరణ కోరగా ఎంటీయూ 13-18 రకం పడలేదని, స్వర్ణరకం పంట నేల కొరిగిందన్నారు. ముఖ్యంగా పాలుపోసుకునే దశలోను, గింజ గట్టిపడే దశలో ఉన్న వరి నేలకొరిగిందన్నారు. నష్టం అంచనా వేసేందుకు కమిటీలు వేసి పొలాల్లో పర్యటిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని వివరించారు.

వరి పొలాల పరిశీలన

కడియం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వరి రైతులు వర్షపునీరు బయటకు పోయే మార్గం ఏర్పాటు చేసుకోవడంతోపాటు జాగ్రత్తలు తీసుకుంటే పంట కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడియం ఆవ ప్రాంతంలో నేలకొరిగిన వరిపంటను ఆయన పరిశీలించారు. సుమారు 67 హెక్టార్లలో వరి పంట నేలవాలిందని శ్రీనివాస్ తెలిపారు. గింజ తోడుకునే సమయంలో, వెన్ను బరువు వల్ల పంట కణుపుల వద్ద విరిగి పంట నేలకొరుగుతుందన్నారు. ఈ విధంగా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజకు సక్రమంగా చేరకుండా గింజ బరువు తగ్గడం, తాలు గింజలు ఏర్పడటం జరుగుతుందన్నారు. దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందన్నారు. పడిపోయిన వరి దుబ్బులను నిలకట్టుకోవాలని ఆయన సూచించారు.

ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు : ఏడీ

కోరుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కోరుకొండ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ జె శశిబిందు తెలియజేశారు. ఆమె విడుదల చేసిన ప్రకటనలో వివరాలు తెలియజేశారు. కోరుకొండ మండలంలో 5625హెక్టార్లు సాగు విస్తీర్ణం కాగా, 41369 మెట్రిక్ టన్నులు దిగుబడి ఉంటుందని, ఇందుకోసం 17ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలియజేశారు. నవంబర్ 5 నుంచి డిసెంబర్ 15 వరకు ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు అదేవిధంగా గోకవరం మండలంలో 5688 హెక్టార్లు సాగు విస్తీర్ణం కాకా 42477మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేస్తూ 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. సీతానగరం మండలంలో 5550 హెక్టార్లు సాగు విస్తీర్ణం కాగా, 41166 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి ఉంటుందని ఇందుకోసం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. నవంబర్ 15 వరకు సీతానగరం మండలంలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సార్వా సీజన్ 2025కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతాంగం నష్టపోకుండా ప్రభుత్వం నిర్ధారించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె వివరించారు. సకాలంలో రైతుల ధాన్యం సొమ్ము వారిఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.


గొల్లప్రోలు మండలం చేబ్రోలు పాఠశాలలో ఆధార్ ప్రత్యేక శిబిరంలో విద్యార్థుల బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవడం తప్పనిసరి. ఇది విద్యార్థులకు అవసరం. పోటీ పరీక్షలకు దరఖాస్తు చేయాలన్నా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా ఇది కీలకం. ఐదు సంవత్సరాలు దాటిన వారంతా తమ బయోమెట్రిక్స్ నవీకరణ చేయించుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఇందుకోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 30వ తేదీ వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడ సేవలు ఉచితంగా లభిస్తాయి.

- బయోమెట్రిక్స్ నవీకరించకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు
- ఉమ్మడి జిల్లాలో చేయించుకోవాల్సిన విద్యార్థులు 1.88 లక్షలు
- ఎంపిక చేసిన పాఠశాలల్లో ఈ నెల 30 వరకు ప్రత్యేక శిబిరాలు
- ప్రస్తుతం సేవలు ఉచితమే

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

బాల ఆధార్ తీయించుకున్న చిన్నారులు, విద్యార్థులు ఐదు సంవత్సరాలు దాటిన తర్వాత ఒకసారి, 15 సంవత్సరాలు దాటిన తర్వాత మరొకసారి తప్పనిసరిగా తమ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయించుకోవాలి. ఇప్పుడు పాఠశాలల్లో అపార్ ఐడీ క్రియేట్ చేసేందుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు, పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు ఆధార్ అవసరం. ఇది అప్‌డేట్ అయితేనే గానీ వీటికి అర్హత సాధించలేరు. దీనిపై ఇప్పటికే పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవకాశం కల్పించినా ఇంకా వేల సంఖ్యలో విద్యార్థులు తమ ఆధార్‌ను అప్‌డేట్ చేయించుకోలేదు. ఇటువంటి వారి వివరాలను విద్యా శాఖ సేకరించింది. వీరందరి ఆధార్ బయోమెట్రిక్స్ (ఎంబీయూ)ను నవీకరించేందుకు యూఐడీఏఐ, గ్రామ, వార్డు సచివాలయ శాఖలతో సంప్రదించి ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో వీటిని ఏర్పాటుచేశారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది.



ఎందుకోసమంటే...

చిన్నారులు (విద్యార్థులు) ఎదుగుతున్న క్రమంలో వారి వేలిముద్రలు, ఫొటో, కనురెప్పల దృశ్యాలు (ఐరిస్ లేదా కంటి కిరణాలు) మారుతూ ఉంటాయి. ఈ క్రమంలో వీటిని ఆధార్ డేటాలో అప్‌డేట్ చేయకుంటే భవిష్యత్తులో ఇబ్బందిపడతారు. పోటీ పరీక్షలు, ప్రభుత్వ పథకాలు... ఇతరత్రా విషయాల్లో ఆధార్ ఆథంటికేషన్ చేయించడంలో సాంకేతిక సమస్యలు తలెత్తుతాయి. దీనికోసం 5సంవత్సరాలు, 15 సంవత్సరాలు దాటిన విద్యార్థులకు మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) తప్పనిసరి చేశారు. అప్‌డేట్ ప్రక్రియను 60-70 శాతం విద్యార్థులు ఇప్పటికే పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారు ఇంకా చేయించుకోకపోవడంతో వారికి పాఠశాలల్లోనే ఉచితంగా చేయించుకునే అవకాశం కల్పించారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా...

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 5-15 సంవత్సరాలు మధ్యన, 15 సంవత్సరాలు దాటిన 1,87,949 మంది విద్యార్థులు తమ ఆధార్ బయోమెట్రిక్స్‌ను ఇంకా అప్‌డేట్ చేయించుకోలేదని విద్యా శాఖ గుర్తించింది. ఇదే సమాచారాన్ని యూఐడీఏఐకు అందజేసింది. కాకినాడ జిల్లాలో 5-15 సంవత్సరాల మధ్య విద్యార్థులు 41,640 మంది, 15 సంవత్సరాలు దాటిన విద్యార్థులు 33,395 మంది ఇంకా ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉంది. తూర్పు గోదావరి జిల్లాలో 5-15 కేటగిరీలో 33,417 మంది విద్యార్థులు, 15 దాటిన వారు 36,471 మంది ఉండగా, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5-15 కేటగిరీలో 23,556 మంది, 15 సంవత్సరాలు దాటిన విద్యార్థులు 19,470 మంది ఆధార్ బయోమెట్రిక్స్‌ను నవీకరించుకోవాల్సి ఉంది.

ఈ నెల 30 వరకు అవకాశం

విద్యార్థులు తమ ఆధార్ బయోమెట్రిక్స్‌ను అప్‌డేట్ చేయించుకునేందుకు వీలుగా కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి డిజిటల్ అసిస్టెంట్లు, సెక్రటరీలను నియమించారు. ఈ నెల 30వ తేదీ వరకు ఇవి కొనసాగుతాయి. పాఠశాలల వారీగా ఆధార్ బయోమెట్రిక్స్ అప్‌డేట్ చేయించుకోవాల్సిన విద్యార్థుల జాబితాను యూడీఐఎస్ఈ ప్లస్ పోర్టల్ ద్వారా పెండింగ్ ఎంబీయూ రిపోర్టును డౌన్‌లోడ్ చేసి వారందరికీ సమాచారం ఇవ్వాలని విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం సూచించింది. నూరు శాతం విద్యార్థులు తమ వివరాలు అప్‌డేట్ చేసేలా చూడాలని ఆదేశించింది. విద్యార్థులు ఇందుకు అవసరమైన పత్రాలు తీసుకుని వచ్చేలా అవగాహన కల్పించాలని హెచ్ఎంలకు సూచనలు ఇచ్చారు. ఇదే విషయంపై విద్యార్థులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇప్పుడు ఆధార్ బయోమెట్రిక్ సేవలను ఉచితంగానే అందిస్తున్నారు.





సూర్యోదయంలోపు స్నానాలు.... పూజలు... ఉపవాసాలు.. కార్తీక మాసంలో ఆధ్యాత్మికతే కనిపిస్తుంది. మాలధారణలు, సంప్రదాయాలు ఉట్టిపడతాయి. హైటెక్ కాలంలోనూ భక్తులు పూర్వకాలం నుంచీ వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తున్నారనడానికి ఈ మాసమే నిదర్శనం. అయితే కాలాన్ని బట్టి మనుషుల్లో వచ్చే కొన్ని రుగ్మతలను అరికట్టేందుకే ఈ ఆచారాలను మన పూర్వీకులు ప్రవేశపెట్టారంటారు వైద్యులు.

ఏకాదశ రుద్రుల దర్శనం... పుణ్యప్రదం

(అంబాజీపేట-ఆంధ్రజ్యోతి)

కోనసీమలో 450 శతాబ్దాల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రులు కొలువుదీరారు. వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి (విశ్వేశ్వర రుద్రుడు), గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వరస్వామి (సర్వేశ్వర రుద్రుడు), నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి (తికాగ్నికాల రుద్రుడు), కె.పెదపూడి మేనకేశ్వరుడు (మహాదేవ రుద్రుడు), పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి (శ్రీమన్మహాదేవ రుద్రుడు), ముక్కామల రాఘవేశ్వరస్వామి (కాలాగ్ని రుద్రుడు), వక్కలంక విశ్వేశ్వరస్వామి (త్రిపురాంతక రుద్రుడు), మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి (నీలకంఠ రుద్రుడు), పాలగుమ్మి చెన్నమల్లేశ్వరుడు (మృత్యుంజయ రుద్రుడు), గంగలకుర్రు చెన్నమల్లేశ్వరస్వామి (సదాశివ రుద్రుడు), ఇరుసుమండ ఆనందరామేశ్వరస్వామి (త్ర్యంబకేశ్వర రుద్రుడు). కార్తీక మాసంతో పాటు ఇతర రోజుల్లో ఏకాదశ రుద్రులను ఒకేరోజు దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని పండితులు చెప్తున్నారు.



ఏకాదశ రుద్రుల దర్శనానికి పలు ఆర్టీసీ డిపోల నుంచి అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందని వారు చెప్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అల్పాహారం, విందు ఏర్పాటు చేసేందుకు ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



దీపారాధన...

శివనామస్మరణ చేస్తూ ఒత్తులను తయారుచేసి రోజుకు ఒకటి చొప్పున మొత్తం 365 ఒత్తులతో శివునికి దీపారాధన జరిపితే పుణ్యం లభిస్తుందని శాస్త్రం చెప్తోంది. ఏకాదశి నాడు ఉపవాసం, ద్వాదశి నాడు తులసి వివాహం, వైకుంఠ చతుర్దశి నాడు ఉసిరి చెట్టు కింద దీపారాధన చేస్తారు. కార్తీక పౌర్ణమి నాడు 365 ఒత్తులతో దీపారాధన చేస్తారు. విష్ణుమూర్తికి ఇష్టమైన పౌర్ణమి రోజున స్నానాలు ఆచరించి సత్యనారాయణస్వామి వ్రతం ఆచరిస్తారు.

వన భోజనం... ఆరోగ్య రహస్యాలు

కార్తీక మాసంలో వన భోజనాలు అధికంగా చేస్తారు. కార్తీక పౌర్ణమి రోజున ఉసిరి చెట్టు కింద సమారాధన చేసి బంధుమిత్రులతో కలిసి భోజనం చేస్తే ఎంతో మంచి జరుగుతుంది. ఉసరిక వనంలో భోజనం చేస్తే పాప విముక్తులై విష్ణులోకానికి వెళ్తారనేది భక్తుల నమ్మకం.

వ్యాధులను కలగజేసే క్రిములను నాశనం చేసేలా ఆవుపేడ యాంటీబయాటిక్‌గా ఉపయోగపడుతుంది. అవకాశం ఉన్నవారు ఈ నెలలో ఇంటి ముందు ఆవుపేడతో కల్లాపి చల్లి ముగ్గులు వేస్తే వ్యాధులు దరిచేరవు. ముగ్గు, పేడలోని రసాయనాల వల్ల వైరస్‌లు వ్యాపించవు.

తులసి మొక్క చుట్టూ ప్రదక్షిణ చేసేటప్పుడు పీల్చే గాలి రోగనిరోధక శక్తిని పెంచుతుంది. స్వచ్ఛమైన గాలిని పీల్చడం వల్ల జలుబు, గొంతు వ్యాధులు రావు. సూర్యోదయంలోపు స్నానం చేస్తే రక్తప్రసరణ సాఫీగా ఉంటుంది.



మహిళలు తెల్లవారుజామునే నిద్రలేవడం, పసుపు రాసుకోవడం, చల్లని నీటితో స్నానం చేయడం, తులసి మొక్కకు నీళ్లు పోసిచుట్టూ ప్రదక్షిణ చేస్తే ఆరోగ్యదాయకం.

అల్పాహారం, మధ్యాహ్నం మిత భోజనం, రాత్రిపూట పండ్లు, పాలు వంటివి తీసుకోవడం ఇందులో భాగమే. కార్తీకమాసమంతా నియమాలు పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

- కార్మిక శాఖ మంత్రి సుభాష్
- ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్లతో కలిసి రాయవరం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ
- ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం
- యజమాని తరపున రూ.2.50 లక్షల చొప్పున అందజేత


కొమరిపాలెంలో మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపత్తులు జరిగి ప్రాణనష్టం వాటిల్లినపుడు పరిహారం అందించడంతో ప్రభుత్వం ముందు వరుసలో నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈనెల 8న బిక్కవోలు మండలం కొమరిపాలెం, రాయవరం మండలం వి.సావరం గ్రామాల సరిహద్దుల్లో గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు శుక్రవారం కొమరిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా పరిహారం అందజేశారు. ముందుగా మృతుల కుటుంబాలకు నివాళులర్పించి సభను ప్రారంభించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం,కురుపూడి జ్యోతి, చిట్టూరి యామిని, కొమరిపాలేనికి చెందిన వెలుగుబంట్ల సత్యానారాయణ, రమణ, వాసంశెట్టి విజయలక్ష్మి, కె.సదానంద్, లింగం వెంకటకృష్ణ,పాకా అరుణ కుటుంబాలకు కార్మిక శాఖ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షలు, యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ తరపున ఆయన కుమారుడు ఒక్కొక్క కుటుంబానికి రూ.2.50 లక్షల పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రతిపక్ష నాయకులు ఈ ఘటనను రాజకీయం చేయాలని చూసి, పలు ఆరోపణలు చేశారని అందుకే ప్రభుత్వం ద్విసభ్య కమిటీని నియమించి నిజానిజాలను తేల్చిందని అన్నారు. దీంతో వైసీపీ మాటలు అసత్యాలని తేలిందన్నారు. బాధితుల్లో 8 మందికి టీడీపీ సభ్యత్వాలు ఉన్నాయని వారికి త్వరలో పార్టీ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నామన్నారు. పరిహారంపై అసత్య ప్రచారాలు చేసిన మాజీ ఎమ్మెల్యే 2019 ఎన్నికల్లో విజయోత్సవంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో నలుగురు చనిపోతే వారికి పరిహారం మాట అటుంచి పరామర్శకే నెలల సమయం పట్టిందన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, అనపర్తి జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, రావాడ నాగు, కర్రి శేషారత్నం, బేరా వేణమ్మ, కర్రి సత్యగౌరి, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

కాకినాడలో తొలి కృత్రిమ మేధస్సు (ఏఐ) సదస్సు


ఏఐ ఫ్యూజన్ సదస్సు-2025 సదస్సుకు విచ్చేసిన ముఖ్య అతిథులు

కాకినాడ సిటీ/కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రాంతంలో తొలి కృత్రిమ మేధస్సు సదస్సు-ఏఐ ఫ్యూజన్ సదస్సు-2025ను శుక్రవారం జిల్లా కేంద్రం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సదస్సును జేఎన్టీయూకే వైస్ చాన్సలర్ సీఎస్ఆర్కే ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 'ఏఐ యాజ్ నెక్స్ట్ ఇండస్ట్రియల్ రివల్యూషన్, షాపింగ్ ద ఫ్యూచర్ బిజినెస్, సొసైటీ -ఇన్నోవేషన్' అంశంపై గోవిన్ కాపిటల్ సీఈవో ఆనంద్ గోవిందలూరి ప్రసంగించారు. ఇతర ముఖ్య అతిథులుగా ఎస్టీపీఐ అదనపు డైరెక్టర్ ఏవీ మల్లేశ్వరరావు, ఐటాప్ అధ్యక్షుడు ఇంద్రజిత్ యానే, ఏపీడీటీ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కోసరాజు విచ్చేశారు. సదస్సులో 1000 మందికి పైగా ఐటీ నిపుణులు, కోర్సెస్, విద్యార్థులు, స్టార్టప్ ప్రతినిధులు, అకడమిక్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సదస్సు ను డీప్ టెక్ నైపుణ్య ఫౌండేషన్, ఏపీ డిజిటల్ టెక్నాలజీ ఇండస్ట్రీ నెట్‌వర్క్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ ఏఐ ఫ్యూజన్ సదస్సుకు భారత ప్రభుత్వ సంస్థయైన ఇండియా ఏఐ మిషన్ నుంచి అధికారిక గుర్తింపు లభించింది. ఈ సదస్సును 2026 ఫిబ్రవరి 19,20 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్- 2026కు ప్రీ- సమ్మిట్ ఈవెంట్‌గా గుర్తించారు.ఈ సమ్మిట్‌లో ఏఐ ఫర్ పీపుల్, ప్లానెట్, ప్రోగ్రస్ అనే అంశంపై ప్రపంచ ఏఐ నిపుణులు ప్రసంగించనున్నారని సదస్సు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా యువ ప్రతిభావంతులను గుర్తిస్తూ బెస్ట్ ఏఐ స్టార్టప్, బెస్ట్ ఏఐ ఐడియా, బెస్ట్ స్టూడెంట్ ఏఐ ప్రాజెక్టు విన్నర్, రన్నర్ అవార్డులు అందజేశారు. సదస్సులో గూగుల్, క్యాప్‌జెమినీ, బోష్, టీసీఎస్, ఇన్ఫోసిస్ తదితర గ్లోబల్ కంపెనీలకు చెందిన ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నిపుణులు పాల్గొన్నారు.




సదస్సులో పాల్గొన్న ఏఐ నిపుణులు, విద్యార్థులు

కార్తీక దీపారాధన ఏర్పాట్లకు రాట ముహూర్తం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బోనం శ్రీను తదితరులు

ద్రాక్షారామ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో నవంబరు 18న నిర్వహించనున్న కార్తీక దీపారాధన ఏర్పాట్లకు శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఉదయం 11.23 గంటలకు వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత సత్తి సుబ్బారెడ్డితో రాట వేయించారు. ముందుగా ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం కార్తీక దీపారాధన కార్యక్రమాల పోస్టర్‌ను సుబ్బారెడ్డి,ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్, సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు కొత్తపల్లి అరుణ, అనిశెట్టి రామకృష్ణ, యల్లమిల్లి సతీష్‌కుమారి, ఎంపీపీ అంబటి భవానీ, వైస్ ఎంపీపీ శాకా బాబి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్, తోట పృథ్విరాజ్, జనసేన నాయకులు నామా వెంకన్నబాబు, చోడిశెట్టి శివాజీ, మాజీ సర్పంచ్‌లు యాట్ల అప్పారావు, కొండేపూడి జానకిరామయ్య పాల్గొన్నారు.

దత్త దీక్షల స్వీకారం

పిఠాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్తాత్రేయ స్వామి సన్నిధిలో దత్త దీక్షల స్వీకారం శుక్రవారం వైభవంగా జరిగింది. భక్తులకు అర్చకస్వాములు మాలధారణ చేశారు. దత్త మహా మండల దీక్ష 41 రోజులు కొనసాగుతుంది. దత్తస్వాములు పాదగయ పుష్కరిణిలో స్నానాలు ఆచరించి దత్తాత్రేయుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు జరిపారు. దత్తాత్రేయస్వామికి విశేష పూజలు జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.



డైట్‌లో అధ్యాపక ఉద్యోగాలకు
దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్)లో డిప్యూటేషన్ పద్ధతిలో 2025-26 విద్యా సంవత్సరానికి అధ్యాపక ఉద్యోగాలకు అర్హులైన పాఠశాల సహాయకులు(ఎస్ఏ)నుంచి దరఖాస్తులను కోరుతున్నట్టు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 58 ఏళ్ల లోపు ఉండి పీజీలో 55శాతం, ఎంఈడీలో 55శాతం కలిగి స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం 5ఏళ్ల అనుభవం ఉండాలన్నారు. దరఖాస్తులను హెచ్ఎం, ఎంఈవో ద్వారా కాకినాడ డీఈవో కార్యాలయంలో ఈనెల 29 సాయంత్రం 5గంటల లోపు సమర్పించాలని సూచించారు. తెలుగు-1, ఆంగ్లం-1, గణితం-1, ఫైన్ ఆర్ట్స్-2 ఖాళీలున్నాయని తెలిపారు. ఫైన్ ఆర్ట్స్‌కు మాత్రం సంబంధిత పీజీలో ప్రథమ లేదా ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలని చెప్పారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా ఈ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఆసక్తి గల ఉపాధ్యాయులు https://forms.gle/oJZMnbkEtNynPLxi9 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి హార్డు కాపీని సంబంధిత అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని డీఈవో పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న అన్నదాన భవన
నిర్మాణానికి రూ.1.50 కోట్ల విరాళం


భవన నిర్మాణాన్ని దాతలతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణంలో భాగంగా కిచెన్, బాయిలర్ల ఏర్పాటుకు దాతలు రూ.1.50 కోట్ల విరాళం అందజేశారు. శుక్రవారం సాయంత్రం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు దాతలు, పశ్చిమగోదావరి జిల్లా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్‌కు చెందిన శ్రీరామరాజు రూ.1.50 కోట్లతో అన్నదాన భవనంలో కిచెన్ నిర్మాణం, స్టీమింగ్ బాయిలర్ల ఏర్పాటుకు విరాళంగా అందజేశారు.అలాగే ఆనంద్ గ్రూప్ చైర్మన్ కాశీవిశ్వనాథరాజు వాటర్ ప్లాంట్, బయోగ్యాస్ ఏర్పాటుకు విరాళం అందించారు. తొలుత దాతలు స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు దాతలకు శేషవస్త్రం కప్పి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేతో కలిసి అన్నదాన భవనంలోని కిచెన్, స్టీమింగ్ బాయిలర్ల ఏర్పాటును పరిశీలించారు. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.

స్విమ్మింగ్‌లో రవితేజకు రజత, కాంస్య పతకాలు



యానాం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియన్ మాస్టర్స్ గేమ్స్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం శాఖకు చెందిన స్విమ్మింగ్ కోచ్ గ్రంధి రవితేజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రజత, కాంస్య పతాకాలను కైవసం చేసుకున్నట్టు యానాం సాయ్ ఇన్‌చార్జి ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు కాన్‌బెర్రాలో జరిగిన పోటీల్లో రవితేజ 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో రజతం, 25 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలో ఉన్న కోచ్ రవితేజకు ఉదయ్‌కుమార్‌తోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

రెజ్లింగ్‌లో వర్షిణికి కాంస్యం



ముమ్మిడివరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీల్లో కాకినాడ బాలికల గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన వడ్డి మేఘవర్షిణి కాంస్య పతకం సాధించింది. విజయవాడలో జరిగిన అండర్-19 రాష్ట్ర ఇంటర్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ 59 కిలోల విభాగంలో మేఘవర్షిణి ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు సిరిమల్లి ఎంపిక



అంబాజీపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి తూర్పుగోదావరి స్థాయిలో నిర్వహించిన అండర్-14 విభాగం బాస్కెట్‌బాల్ పోటీల్లో అంబాజీపేట హైస్కూల్ 7వ తరగతి విద్యార్థి జి.సిరిమల్లి ఎంపికైనట్టు పీడీ కుంపట్ల ఆదిలక్ష్మి తెలిపారు. వచ్చే నెల 1, 2, 3 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర పోటీల్లో ఆమె పాల్గొంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పలువురు అభినందించారు.

వనదుర్గ ఆలయంలో ఘనంగా చండీహోమం



హోమ పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం ఒకదాత రూ.1,00116 విరాళంగా సమర్పించారు. మిర్యాలగూడకు చెందిన కొంకిమాళ్ల ప్రకాష్ ఈ మొత్తాన్ని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

రూ.2.50 కోట్లతో విశ్రాంత షెడ్డు

సత్యదేవుడి భక్తులకు అంకితం

నిర్మించిన లారస్ ల్యాబ్ సంస్థ



విశ్రాంత షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖ ఫార్మా షూటికల్ సంస్థ లారస్ ల్యాబ్ రూ.2.50 కోట్లతో నిర్మించిన విశ్రాంత షెడ్డును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించగా దీనిని భక్తులకు అంకితమిస్తున్నట్టు సంస్థ సీఈవో చావా సత్యనారాయణ పేర్కొన్నారు. భక్తులు అధికంగా ఉండే పశ్చిమ రాజగోపురం ఎదురుగా దీనిని నిర్మించారు. రత్నగిరికి విచ్చేసే సాధారణ భక్తులు ఎండకు ఎండి, వర్షానికి తడుస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2023లో దీనిని నిర్మించేందుకు సంస్థ ముందుకొచ్చినా సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఇటీవల అన్నవరం దేవస్థానం ఛైర్మన్ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు మరోసారి సంస్థ ప్రతినిధులతో చర్చించి కార్తీకమాసం ప్రారంభానికి అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నించారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ లారస్ సంస్థ దాతృత్వాన్ని కొనియాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా పాల్గొన్నారు.



అన్నవరంలో భక్తుల కోసం లారస్ ల్యాబ్ నిర్మించిన విశ్రాంత షెడ్డు

ఇంకెన్నిరోజులో!

- వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసు ఛార్జిషీటు గడువు పెంపు
- మరో ఐదునెలల గడువు మంజూరు చేసిన అట్రాసిటీ న్యాయస్థానం
- ఇప్పటికే న్యాయస్థానం 90 రోజులు గడువు ఇచ్చినా పూర్తికాని తదుపరి విచారణ
- ఎస్ఎఫ్ఎల్ నివేదికలు అందకపోవడం, సాక్ష్యుల విచారణ పూర్తవలేదని ప్రాసిక్యూషన్ విజ్ఞప్తి
- గత వైసీపీ హయాంలో కేసును నీరుగార్చేయడంతో తాజా విచారణలో పోలీసులకు ఎన్ని చిక్కులో

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించి తదుపరి విచారణలో అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. కేసులో తదుపరి విచారణ కొనసాగించి 90రోజుల్లో ఛార్జిషీటు దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించినా ఇప్పటికీ ఆ దిశగా పెద్దగా పురోగతి కనిపించడం లేదు. గత ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో అప్పట్లో పోలీసులు కేసును నీరుగార్చేయడంతో ఇప్పుడు పూర్తిస్థాయి ఆధారాల సేకరణ పోలీసులకు కష్టమవుతోంది. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని అట్రాసిటీ న్యాయస్థానం ఇదివరకే ఇచ్చిన 90రోజుల గడువు బుధవారంతో ముగిసిపోయింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఇచ్చిన గడువులోగా ఛార్జిషీటు దాఖలు చేయలేని పరిస్థితి నెలకొనడంతో మరో ఐదునెలల పాటు అదనపు గడువు కావాలని తాజాగా ప్రాసిక్యూషన్ న్యాయస్థానాన్ని అభ్యర్థించింది. హత్యకు సంబంధించి డ్రైవర్ సుబ్రహ్మణ్యం మృతదేహం నుంచి సేకరించి నమూనాలను స్టేట్ ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపి చాలా కాలం అవుతున్నా ఇంకా వాటికి సంబంధించి లోతైన విశ్లేషణ నివేదిక అందలేదని ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. అలాగే కేసు తదుపరి విచారణలో భాగంగా గూగుల్ టేకవుట్, నిందితుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కాల్ డేటా సేకరణ, హత్య సమయంలో నిందితుడితో ఉన్న కొందరు వ్యక్తులు, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు తీసు కోవాల్సి ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణ లోతుగా చేపట్టి ఛార్జిషీట్ దాఖలకు ఐదు నెలల గడువు కోరింది. వీటన్నింటిని పరిశీలించిన న్యాయస్థానం మరో ఐదునెలల పాటు అదనపు గడువు మంజూరు చేసింది.

అప్పుడు ఏం జరిగింది..?

కాగా ప్రశాంత నగరంగా పేరొందిన కాకినాడ 2022 మేలో అట్టుడికిపోయి ంది. తన వద్ద పని చేసే దళిత డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి మృతదేహాన్ని ఏకంగా మృతుడి ఇంటికి డోర్ డెలివరీ చేశాడు. అప్పటి సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరొందిన ఎమ్మెల్సీ అనంతబాబు 2022 మే 18న రాత్రి కాకినాడలో డ్రైవర్ సుబ్రహ్మణ్యం ఇంటికి వచ్చి పని ఉందని తీసుకువెళ్లాడు. ఆ తర్వాత కా కినాడ బీచ్‌రోడ్డులో నిర్జీవ ప్రదేశానికి తీసుకువెళ్లి బలమైన కర్రతో శరీరంపై 30చోట్ల దారుణంగా దాడి చేసి చిత్రహింసలకు గురి చేసి కొట్టి చంపా డు. తెల్లవారుజామున మే19న మృతదేహాన్ని స్వయంగా తన కారులో అనంతబాబు కాకినాడ కుళాయిచెరువు ఎదురుగా ఉన్న డ్రైవర్ ఇంటికే తీసుకువచ్చాడు. హత్యను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. రోడ్డు ప్రమా దంలో సుబ్రహ్మణ్యం చనిపోయాడని ఆయన తల్లిదండ్రులను నమ్మించే ప్రయత్నం చేశాడు. తీరా కుటుంబీకులు తిరగబడ్డంతో అంత్యక్రి యలకు డబ్బులు ఇస్తానని, నోరు తెరవొద్దని బెదిరించాడు. ఆగ్రహంతో బాధితులు నిలదీయడంతో కారు వదిలేసి అక్కడి నుంచి అనంతబాబు పారిపోయాడు. ఆ తర్వాత అరెస్ట్ అవకుండా ప్రయత్నించాడు. అధికారంలో ఉన్న వైసీపీ నేతల అండదండలతో మూడురోజులు ఓ ఇంట్లో మకాం వేశాడు. ప్రభుత్వ పెద్దలకు సన్నిహితుడు కావడంతో అనంతబాబు కోసం పోలీసులు కనీసం గాలించలేదు. ఆ తర్వాత మీడియా ఒత్తిడితో గాలింపు ముమ్మరం చేయగా, అదే సమయంలో హత్య తానే చేశానని పోలీసుల ఎదుట అనంతబాబు ప్రత్యక్షమయ్యాడు. తీరా అధికార పార్టీ ఒత్తిళ్లతో పోలీసులు కేసును నీరుగార్చడం కోసం కేవలం అనుమానాస్పద హత్యగా కేసు నమోదు చేయడానికి ప్రయత్నించారు. కానీ బాధితులు, దళితసంఘాలతో ఆందోళనతో చివరకు కేసును హత్యకేసుగా మార్చారు. ఆ తర్వాత అనంతబాబును అరెస్ట్ చేసి రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలుకు తరలించారు. ఆ తర్వాత పోలీసులు దాఖలు చేసిన ఛార్జిషీటులోను అనంతబాబుకు అనుకూలంగా వ్యవహరించారు. అయితే సుదీర్ఘ కాలం జైల్లో గడిపిన అనంతబాబు మధ్యంతర బెయిల్‌పై ప్రస్తుతం స్వేచ్ఛగా బయటే తిరుగుతున్నాడు. కాగా హత్య కేసు ఆరోపణలతో అనంతబాబును పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించిన జగన్, ఆ తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతబాబును పక్కన పెట్టుకుని వైసీపీ మంత్రులతోపాటు అప్పట్లో సీఎం జగన్ సైతం బహిరంగ సభలకు హాజరవడం తీవ్ర దుమారం రేపింది. అయితే ప్రభుత్వం మారాక కేసు విచారణ వేగం పుంజుకుంది. ఈ కేసుపై తొలి నుంచీ పోరాటం చేస్తోన్న ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు సహకారం పోలీసులకు అవసరం అని ప్రభుత్వం భావించి కొంతకాలం కిందట ఆయన్ను ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు నియమించింది. ఆ తర్వాత రాజమహేంద్రవరం న్యాయస్థానంలో కేసు మరింత లోతైన విచారణకు ప్రాసిక్యూషన్ కేసు దాఖలు చేయడగా, జులై 22 నుంచి 90 రోజుల్లోపు తదుపరి విచారణ పూర్తి చేసి ఛార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించింది.

రైలులో గంజాయి రవాణా

రూ.7 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్న సామర్లకోట పోలీసులు



సామర్లకోట రైల్వే స్టేషన్‌లో స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా యశ్వంత్ పూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో పెద్దఎత్తున గంజాయి రవాణా చేస్తున్నారన్న శుక్రవారం రాత్రి 10 గంటలకు వచ్చిన సమాచారంతో సామర్లకోట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు, జీఆర్‌పీ పోలీసులు సంయుక్తంగా రైలులో తనిఖీలు నిర్వహించారు. ఎస్-1 బోగీ నుంచి ఎస్-6 బోగీల వరకూ సీట్ల కింద తనిఖీలు నిర్వహించగా 140 కిలోల పరిమాణంలో 15 బాక్సులుగా ప్యాక్ చేసి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆయా సీట్ల వద్ద ఉన్న ప్రయాణికులను ఆరా తీయగా తమకేమీ సంబంధం లేనట్టు చెప్పారని పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని రైలు నుంచి కిందికి దింపి రైల్వే పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.7 లక్షల మేర ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో గంజాయి రవాణా చేస్తున్న వారెవ్వరూ పట్టుబడకపోవడం గమనార్హం. స్వాధీనం చేసుకున్న గంజాయిని శనివారం సామర్లకోట మండల మెజిస్ట్రేట్ ఎదుట ఉంచుతామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆర్‌పీఎఫ్ పోలీసులు తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

ఎనిమిది బైక్‌ల స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో బైక్‌లు దొంగతనం చేస్తున్న ఇద్దరిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద మమత రెస్టారెంట్ బయట పార్క్ చేసిన ఏపీ05 బీటీ 4855 నెంబరు గల బైక్‌ను ఈనెల 16న దొంగలు అపహరించారని బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 23న వారికి వచ్చిన సమాచారం మేరకు ఈ బైక్ దొంగిలించుకుపోయిన ధవళేశ్వరం కాంచర లైన్‌కు చెందిన కశింకోట గనిరాజు అలియాస్ గని, సిర్రరాజా నిర్మలప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఏడు బైక్‌లు, టూటౌన్ పరిధిలో అపహరించిన ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు.

యువతిపై వైద్యుని కుటుంబం దాడి

కేసు నమోదు

అమలాపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వివాహం నిశ్చయమైన యువతిపై వైద్యుని కుటుంబీకులు దాడి చేయడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం దుడ్డువారి అగ్రహారానికి చెందిన యువతికి కొంకాపల్లికి చెందిన విజయ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ గంటా బెనర్జీతో కొంతకాలం క్రితం వివాహం నిశ్చమైనట్టు యువతి ఆరోపిస్తూ శుక్రవారం ఆసుపత్రి వద్దకు కుటుంబ పెద్దలతో ఆందోళనకు దిగింది. తనను ఎందుకు పెళ్లి చేసుకోరని నిలదీయడంతో యువతిపై డాక్టర్ బెనర్జీ కుటుంబీకులు దాడి చేసినట్టు ఆమె ఆరోపించింది. అప్పటికే దాడిలో గాయపడ్డ ఆమెను అమలాపురంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. డాక్టర్ బెనర్జీ కుటుంబ సభ్యులపై యువతి దాడికి పాల్పడినట్టు ఆయన కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కానీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువతి నుంచి అందిన ప్రాథమిక సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్‌తో పాటు అధికారులు అప్రమత్తమయ్యారు. యువతి తాళ్ల ప్రజ్ఞ ఇచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ రత్నబెనర్జీ, విజయ్‌బెనర్జీ, రత్నకుమారిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ వీరబాబు తెలిపారు.

పిడుగుపాటుకు గృహోపకరణాల ధ్వంసం

ఐ.పోలవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లకు చెందిన టీడీపీ మాజీ ఎంపీటీసీ, టీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి గంజా సుధాకర్ ఇంటిపై గురువారం రాత్రి పిడుగు పడి గృహం, గృహోపకరణాలు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. రిఫ్రిజిరేటర్, టీవీ, ఫ్యాన్లు, విద్యుత్ వైరింగ్ ధ్వంసమయ్యాయి. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు శుక్రవారం దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. జరిగిన ప్రమాదంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, వీరేశ్వరస్వామి దేవస్థానం ఛైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, జంపన బాబు, రాయపురెడ్డి మాణిక్యం, ఏలూరి మూర్తి, గంజా శ్రీనివాస్, సవరపు కొండ,వెంకటేశ్వరరావు ఉన్నారు.



మురమళ్ళలో దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

ఎక్సైజ్ సురక్ష యాప్‌తో నకిలీ మద్యానికి చెక్ : మంత్రి సుభాష్



రామచంద్రపురంలో సురక్ష యాప్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యాన్ని విక్రయిస్తే ఉపేక్షించబోమని, కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన మద్యం సరఫరా చేస్తుందని మంత్రి సుభాష్ తెలిపారు. శుక్రవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం బస్టాండు సమీపంలో ఆర్ఆర్ వైన్ షాపును ఆయన పరిశీలించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక మద్యం విధానం తీసుకువచ్చి నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు.ముఖ్యంగా అక్రమ మద్యం అమ్మకాలు అరికట్టేందుకు, నాణ్యతను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఎక్సైజ్ సురక్షయాప్‌ను రూపొందించిందని తెలిపారు. మద్యాన్ని కొనుగోలు చేసిన వారు బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తాము కొనుగోలు చేసిన మద్యం నకిలీదా, నాణ్యమైనదా తెలుసుకోవచ్చన్నారు. గత ప్రభుత్వం జేబ్రాండ్స్ మద్యం పాలసీతో ఇష్టానుసారంగా నాసిరకం మద్యం అమ్మకాలు చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడిందన్నారు. సురక్షయాప్ వినియోగంపై ప్రతీ గ్రామంలోను అవగాహన కల్పించాలని కోరారు. యాప్‌తో మద్యం ఎక్కడ, ఎప్పుడు, ఏ కంపెనీలో తయారయ్యిందో, రేటు కూడా తెలుసుకోవచ్చన్నారు. నకిలీ మద్యం తయారీ కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుందని మంత్రి తెలిపారు. ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాస్, ఎస్ఐలు ఉన్నారు.

భార్యను చాకుతో పొడిచిన భర్త అరెస్ట్

14 రోజుల రిమాండ్

పి.గన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడిలో ఈనెల 20న భార్యను చాకుతో పొడిచిన భర్తను శుక్రవారం అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టుకు తరలించగా రిమాండ్ విధించారు. ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన నేలపూడి గంగరాజు తన భార్య పల్లాలమ్మ(పల్లవి)తో ప్రతిరోజు గొడవపడుతూ పిల్లలను కొట్టేవాడు. చాకుతో చంపుతానని బెదిరించేవాడు. ఈ క్రమంలోనే దీపావళి రోజున భార్యపిల్లలతో గొడవపడుతూ భార్యను చాకుతో పొడిచాడు. పిల్లలు గట్టిగా అరవడంతో గంగరాజు అక్కడ నుంచి పారిపో యాడు. పల్లాలమ్మ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుందని, పరారీలో ఉన్న గంగరాజును సమాచారం మేరకు ఉడిమూడి గ్రామంలో అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం కొత్తపేట కోర్టుకు తరలించగా మెజిస్ట్రేట్ 14 రోజుల పాటు రిమాండ్ విధించగా గంగరాజును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన

వ్యక్తికి ఐదేళ్ల జైలు

తొండంగి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి న్యాయమూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్టు తొండంగి ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. 2016లో కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏ.కొత్తపల్లి గ్రామానికి చెందిన కొల్లూరి హరిప్రియ అనే మహిళ పట్ల గూటూరి సత్తిబాబు అనే వ్యక్తి ఎవరూలేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించినట్టు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ కృష్ణమాచారి కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేశారు. వాదోపవాదనలు విన్న తుని జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు మేజిస్ట్రేట్ లంకా గోపీనాథ్ శుక్రవారం నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్టు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. తుని రూరల్ సీఐ చెన్నకేశవరావు కేసు పర్యవేక్షించగా కోర్టు కానిస్టేబుల్ తాతాజీ సాక్షుల్ని ప్రవేశపెట్టారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

కడియం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం వీరవరంలో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో సీఐ ఎ.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ బి.దుర్గాప్రసాద్ దాడి చేశారు. వీరవరంలో బి.సుధీర్ నర్సరీ టైల్‌షెడ్‌లో పేకాడుతున్న 13 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,050 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

యుక్తధార పోర్టల్‌తో ఉపాధి హామీ పనులు

జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్



సామర్లకోటలో ప్రసంగిస్తున్న ప్రసాద్

సామర్లకోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఇక నుంచి అమలుచేయనున్న అభివృద్ధి పనులన్నీ యుక్తధార పోర్టల్ సాంకేతిక పరిజ్ఞానంతోనే చేయాలని జాతీయ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎన్ఎస్ఆర్.ప్రసాద్ పేర్కొన్నారు. కాకినాడ జిల్లా సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రం ఆవరణలో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, జూనియర్ ఇంజనీర్లకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసాద్ హాజరయ్యారు. విస్తరణ శిక్షణాకేంద్ర ప్రిన్సిపాల్ కెఎన్వీప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా తరగతుల్లో ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం పనుల ప్రణాళికలో రాష్ట్రవ్యాప్తంగా 30 శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జీఐఎస్, జీపీఎస్, డ్రోన్ సాంకేతికలపై సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో 3రోజుల పాటు ఒక్కొక్క బ్యాచ్‌కు శిక్షణ ఇస్తామన్నారు.ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో సబ్జెక్ట్ నిపుణులు, రెసిడెన్షియల్ పద్ధతిలో ఇస్తున్న 3రోజుల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుని క్షేత్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. శిక్షణా కేంద్రంలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బంది 320 మందికి 8 బ్యాచ్‌లుగా శిక్షణ ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ డి.శ్రీనివాసరావు, డీడీవో శర్మ, నరేగా అధ్యాపకులు సాగర్, మంగాలక్ష్మి, సూర్యావతి, 5 జిల్లాలకు చెంది టీఏలు, జేఈలు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి

4వేల క్యూసెక్కుల నీరు విడుదల

మోతుగూడెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలాశయం నుంచి 4వేల క్యూసెక్కుల నీటిని దిగువకు శుక్రవారం విడుదల చేసినట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. డొంకరాయి జలాశయం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 1037 అడుగులు కాగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో డొంకరాయి జలాశయం ఎగువ ప్రాంతాల్లో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు 1036.60 అడుగులకు చేరుకోవడంతో జలాశయం పెరగకుండా చర్యలు చేపట్టారు. ఈ మేరకు గురువారం రాత్రి గేటు ద్వారా 2 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేసినప్పటికీ భారీగా కురుస్తున్న వర్షానికి ఇన్‌ఫ్లోస్ వచ్చి చేరుతున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి జలాశయం 6, 7 నెంబర్ గేట్లు ఎత్తి వాటి ద్వారా 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని జెన్‌కో అధికారులు తెలిపారు. అలాగే పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి కోసం మరో 4వేల క్యూసెక్కులను కెనాల్‌కు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయానికి పరీవాహక ప్రాంతాల నుంచి 8వేల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లోస్ వస్తున్నాయని, ఇన్‌ఫ్లోస్ తగ్గేంతవరకు దిగువకు నీటి విడుదల కొనసాగుతుందని ఏపీ జెన్‌కో ఏఈఈ శివశంకర్ తెలిపారు.

నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



పోలీసులకు చిక్కిన అంతర్‌రాష్ట్ర గజదొంగ



గజదొంగ చింతా గణేష్

అల్లవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం మొగళ్లమూరుకు చెందిన అంతర్‌రాష్ట్ర గజదొంగ చింతా గణేష్ అరెస్టు అయ్యాడు. ఇతడిపై పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. భక్తులు ఆలయాల వద్ద కారులు ఆపి ముందుజాగ్రత్తగా తమ బంగారు ఆభరణాలను తీసి కార్లలో పెట్టి లాక్ వేసుంటారు. అయితే ఆలయాలకు వెళ్లే వారిని గణేష్‌పై టార్గెట్ చేస్తుంటాడు. చాకచక్యంగా కార్ల ఫ్రంట్ గ్లాస్ దింపి బంగారు వస్తువులతో పరారవుతుంటాడు. అమలాపురం పోలీసులకు చిక్కిన ఈ దొంగ ఇటీవల తుని పోలీసుల వలలో పడ్డాడు. విజయవాడలో చేసిన రెండు పెద్ద దొంగతనాల వివరాలు బయట పెట్టడంతో ఆభర ణాలు రికవరీ చేసే పనిలో తుని పోలీసులు ఉన్నారు. దాదాపు రూ.2 కోట్ల పైబడి సొత్తు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు.

పొలంలో జారిపడి గిరిజనుడి మృతి



శ్రీనివాసరావు మృతదేహం

వై.రామవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలో ఓ గిరిజనుడు పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. కొయ్యూరు మండలం మంప పంచాయితీ ఆర్.దొడ్డవరం గ్రామానికి చెందిన మొట్టడం శ్రీనివాసరావు (5 0) గురువారం రాత్రి పొలం వద్ద కాపలాకు వెళ్లాడు. శుక్రవారం ఉదయం పనులు చేస్తుండగా చాపరాయిపై నాచు పట్టడంతో జారిపడ్డాడు. అంబులెన్స్‌లో సరిహద్దున ఉన్న వై.రామవరం సీహెచ్‌సీకి తీసుకురావడంతో అప్పటికే మృతి చెందినట్టు ఆసుపత్రి సూపరిండిండెంట్ చైతన్యకుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి అడ్డతీగల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై మంప పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శంఖవరంలో డెంగ్యూ కలకలం

శంఖవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా శంఖవరం వైష్ణవమాన్యం కాలనీలో డెంగ్యూ కలకలం రేగింది. కాలనీకి చెందిన మహిళ డెంగ్యూ లక్షణాలతో ఆసుపత్రిలో చేరడంతో సిబ్బంది అప్రమత్తమయ్యారు. పలువురి నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు తరలించారు. వైద్యసిబ్బంది, పంచాయితీ సిబ్బంది ఆ కాలనీని జల్లెడపట్టారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. దోమల మందుకొట్టి మురుకినీరు చేరకుండా చూసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. పారిశుధ్య లోపం కారణంగానే ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పలువురు చెప్పారు.



శంఖవరంలో పారిశుధ్య చర్యలు చేపడుతున్న సిబ్బంది

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి | www.andhrajyothy.com

సెన్సార్లతో స్థిరమైన సాంకేతిక అభివృద్ధి

దివాన్‌చెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ప్రపంచం అనేక పర్యావరణ సమస్యలను ఎదుర్కొంటోందని, ఈ తరుణంలో స్థిరమైన సాంకేతిక అభివృద్ధిలో సెన్సార్లు కీలక పాత్ర పోషిస్తాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల ఈఐఈ విభాగం ఆధ్వర్యంలో సెన్సార్లు ఇంటరెస్పింగ్, ఇంటిగ్రేషన్ ఫర్ సస్టెయినబుల్ టెక్నాలజీస్ అనే అంశంపై శుక్రవారం ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తెలివైన, స్థిరమైన సాంకేతిక పురోగతికి ప్రాథమిక వెన్నెముకగా సెన్సార్లు పనిచేస్తాయన్నారు. మానవ వనరుల అవసరాలను తగ్గించడం, సమాజ శ్రేయస్సు కోసం వనరుల సామర్థ్యం స్థిరత్వాన్ని మెరుగుపరచడం ద్వారా వివిధ రంగాలలో స్మార్ట్, ఇంటెలిజెంట్ సెన్సింగ్ పరికరాలు ఉపయోగపడుతున్నాయన్నారు. వరంగల్ ఎన్ఐటీ కెమికల్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకులు కేఎస్ రాజమోహన్, హైదరాబాద్ సీఎస్ఐఆర్ ఎయిర్‌బోర్న్ ఇంజనీరింగ్ జియోఫిజిక్స్ ఇన్స్ట్రుమెంటేషన్ విభాగం సీనియర్ టెక్నికల్ అధికారి జి.వంశీకృష్ణ రీసోర్స్‌పర్సన్లుగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, జె.హనుమంతు, డి.శ్రీనివాసరావు, డి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఎన్‌సీసీ నమోదు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఫస్టియర్ విద్యార్థినులకు ఎన్‌సీసీ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నమోదుకు అధిక సంఖ్యలో విద్యార్థినులు ఆసక్తి కనబరిచారు. అధికారులు ఎన్‌సీసీ శిక్షణ లక్ష్యాలు, ప్రయోజనాలు, వ్యక్తిత్వ వికాసం, సామాజిక సేవా కార్యక్రమాలు, రాష్ట్ర, జాతీయ స్థాయి శిబిరాలలో పాల్గొనే అవకాశాలపై వారికి వివరించారు. ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ఎన్‌సీసీ యూనిట్ కృషిని అభినందించారు. కొత్తగా చేరిన కేడెట్లు ఏకత్వం, క్రమశిక్షణ, దేశభక్తి వంటి విలువలను పాటిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఈ నమోదు కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్‌తోపాటు ఎన్‌సీసీ అధికారులు కె.కళై, మహేష్, కళాశాల సిబ్బంది బి.జానకి, రంజని పర్యవేక్షించారు.

రేపు కోరుకొండలో నిరసన సభ

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గాడాలలో దళిత వ్యక్తిపై దాడి జరిగి 25 రోజుల గడిచిన దీనిపై బాధితుడికి సరైన న్యాయం జరగలేదని, దానిని నిరసిస్తూ ఈనెల 26న కోరుకొండలో సభ నిర్వహిస్తామని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అన్నారు.రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థల్లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గాడాల దళితుడిపై దాడి చేసిన వారిలో మరో నలుగురిని అరెస్టు చేయాల్సి వుందన్నారు.నెల్లూరు తిరుమలశెట్టి లక్ష్మీనాయుడు హత్య తర్వాత ప్రభుత్వం ఆ కుటుంబాన్ని ఆదుకుందన్నారు. కాని గాడాల ఘటనపై స్పందించలేదన్నారు. అందుకు నిరసనగా కోరుకొండలో జరిగే సభకు పోలీసులు సహకారం అందించాలని కోరుతున్నామన్నారు. ఇక రాష్ట్రానికి గూగుల్ సెంటర్ రావడంపై ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతున్నామని, కాని ఆ సెంటర్‌లో వినియోగించే నెట్, సాంకేతిక పరికరాల విషయంలో ప్రభుత్వ రంగ సంస్థయైన బీఎస్ఎన్ఎల్‌ను కాదని ఎయిర్‌టెల్‌కు ఇవ్వడం అక్రమ లబ్ధి పొందడమేనని అన్నారు.

ఆలయాలు, ధార్మిక సంస్థలకు సమర్థనీయ కమిటీలు

ఎమ్మెల్యే వాసు


సత్యనారాయణస్వామి దేవస్థానం పాలక మండలిని అభినందిస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో వివిధ దేవాయాలు, ధార్మిక సంస్థలకు సమర్థవంతమైన కమిటీలను వేశామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక ఆర్యాపురం సత్యనారాయణ స్వామి దేవస్థానం నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం శుక్రవారం రాత్రి జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నగర అధ్యక్షుడు మజ్జి రాంబాబు అధ్యక్షతన జరిగిన సభకు ఎమ్మెల్యే వాసుతో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, కాశి నవీన్‌కుమార్, వై.శ్రీనివాస్, జామి సత్యనారాయణ విచ్చేసి కమిటీని అభినందించారు.సత్య నారాయణస్వామి దేవస్థానం చైర్మన్‌గా మళ్ల వెంకట్రాజుతోపాటు డైరెక్టర్లు నియమితులైన మరో పదకొండు మందితో ప్రమాణస్వీకారం చేయించారు.

సెమీకండక్టర్ల పరిశ్రమలో గణనీయమైన వృద్ధి

రాజానగరం, అక్టోబరు 26(ఆంధ్రజ్యోతి): అధునాతన సాంకేతిక పరిజ్ఞానానికి పెరుగుతున్న డిమాండ్ కారణంగా సెమీకండక్టర్లు పరిశ్రమ ఘననీయమైన వృద్ధి సాధిస్తోందని యూకేలోని అనలాగ్ డివైస్ సీనియర్ డైరెక్టర్ ఆఫ్ ఇంజనీరింగ్ డాక్టర్ రాజశేఖర్ నాగులపల్లి అన్నారు. జీజీయూలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఆధునిక సిమాస్ సాంకేతికతలో బాండ్ గాప్ రిఫరెన్స్ క్రమబద్ధమైన రూపకల్పన అనే అంశంపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. హెచ్‌వోడీ పి.వెంకటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాజశేఖర్ కీరిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసి మాట్లాడారు. ప్రభుత్వాలు కుడా సెమీకండక్టర్ల తయారీ, పరిశోధన, అభివృద్ధిలో భారీగా పెట్టుబడులు పెడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా వీసీ యు.చంద్రశేఖర్, ప్రొ వీసీ కేవీబీ రాజులతో రాజశేఖర్ సమావేశమై పలు విద్యసంబంధిత, పరిశోధనాభివృద్ధి విషయాలపై చర్చించారు. అనంతరం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జీజీయూ పరిశోధనాభివృద్ధి డైరెక్టర్ ఆర్ఎస్‌రాజు, డీన్ బి.ప్రభాకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలియోపై అవగాహన

సీతానగరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) పోలియో నివారణ దినం సందర్భంగా గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి కె.శైలజారాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో వ్యాధి వల్ల చిన్న పిల్లల్లో అంగవైకల్యం కలుగుతుందని, ఇది రాకుండా పుట్టిన ప్రతి బిడ్డకి విధిగా పోలియో ఇంజెక్షన్ చేయించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ సిబ్బంది ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ రఘునాథ్, ఎంపీహెచ్‌ఈవో వై.సుబ్బారాయుడు, పీహెచ్ఎన్ ఆదిలక్ష్మి, స్టాఫ్ నర్సు నాగమణి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

కోరుకొండ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా పాఠశాల స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ విజేతలను కోరుకొండ మండల విద్యాశాఖాధికారులు టి.కుశలవదొర, ఎం.సుజాత ప్రకటించారు. వక్తృత్వంలో బి.లోకేశ్వరి దుర్గ (దోసకాయలపల్లి), బి.హేమ సత్య, జి.యశస్వరి (శ్రీరంగపట్నం) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వ్యాసరచనలో ఎం.దివ్య, ఈ.కమలాకుమారి(గాడాల), దుర్గా లక్ష్మిసాయి(కోరుకొండ) వరుస స్థానాల్లో నిలిచారు. క్విజ్‌లో జె.ఉమలలితాదేవి, జి.తరుని, యుఎస్ఎస్ లక్ష్మి(కోటి) మొదటి స్థానంలో నిలువగా, గాడాల, గాదరాడ జడ్పీ హైస్కూళ్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. విజేతలందరూ ఈ నెలాఖరున నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఎంఈవోలు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఎ.రామరెడ్డి, క్విజ్ మాస్టర్ శ్రీనివాస్, ఎం.వరలక్ష్మి, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

నల్లజర్ల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవపాడులో నెంబరు-20 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏలూరు ఆర్‌జేడీ సుజాతరాణి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం కేంద్రానికి సీడీపీవో మమ్మితో కలిసి వచ్చి రికార్డులు, స్టాక్ బ్యాలెన్స్‌లను తనిఖీ చేశారు. రికార్డులు సరిగ్గా ఉండడంతో సంతృప్తి చెందారు. సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, హారతి పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు టౌన్‌ప్లానింగ్‌లో అత్యధికం


శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రికార్డును తనిఖీ చేస్తున్న కమిషనర్

» కోర్టు కేసులతో అప్రమత్తంగా ఉండాలి
» అన్ని విభాగాల హెచ్‌వోడీలతో సమావేశంలో మునిసిపల్ కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సంబంధిత అధికారులు వారి పరిధిలో కేసులు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్ విభాగాల హెచ్‌వోడీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కోర్టు కేసుల విషయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ధిక్కారణ కేసులపై అధికారులు తక్షణం స్పందించాలని సూచించారు. ఏదైనా కోర్టు ఉత్తర్వులుంటే వాటిని అమలు చేయాలని లేదంటే కౌంటర్లు, అప్పీళ్లు దాఖలు చేయాలని చెప్పారు. ప్రాథమిక దశలోనే ప్రభుత్వ ఉత్తర్వులు గాని, సూచనలు గాని కోర్టుకు అందజేసిన యెడల వాటిని అమలు చేసి పక్కగా రికార్డు చేసుకోవాలన్నారు. చివరి ఉత్తర్వులు వచ్చాక దానిని అమలు చేయడం గాని అప్పీల్‌కు వెళ్లాల్సి వస్తే సకాలంలో అప్పీలు వేయాలన్నారు. కోర్టు ధిక్కారణ ఎట్టి పరిస్థితుల్లోను కాకుడదని స్పష్టం చేశారు. వచ్చే సమావేశానికి శాఖలు వారీగా ప్రోగ్రెస్ చూపాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్‌వెంకటరమణ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం తనిఖీ

స్థానిక 8వ వార్డులోని ప్రకాష్‌నగర్‌లో ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాన్ని కమిషనర్ రాహుల్‌మీనా తనిఖీ చేశారు. ఉదయం వార్డులో పారిశుధ్య పనులను పరిశీలించిన ఆయన శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రికార్డులు, రిజిష్టరు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉదయం 7గంటలకు ఇంటింటా చెత్తసేకరణ పూర్తి చేయాలన్నారు. ప్రతి వాహనానికి రూట్ మ్యాప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే పలు వీధుల్లో శానిటేషన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు ఆదేశాలిచ్చారు. వర్షాల నేపథ్యంలో డ్రైనేజీల్లో ఎక్కడా నీరు నిల్వ లేకుండా పూడిక తొలగించాలన్నారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయరాదని, పిచ్చి మొక్కలు పెరగకుండా చూడాలని అలా పెరిగితే స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఖాళీ స్థలం చుట్టు గ్రీన్‌మ్యాట్‌లు ఏర్పాటు చేసుకోవాలని స్థల యజమానులకు సూచించాలన్నారు. పారిశుధ్య సిబ్బంది ఎంతమంది విధుల్లో ఉన్నారో ఆరాతీశారు.ఈ సందర్భంగా ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇతర అధికారులున్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ త్రినాథబాబు

దివాన్‌చెరువు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను అనుసరించి అవసరమైన విద్యార్హతలతో ఉద్యోగాలు పొంది సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులను టెట్ పరీక్ష నుంచి మినహాయించాలని ఎస్టీయూ రాష్ట్ర ఎయిడెడ్ కన్వీనర్ సూరి జయ త్రినాథబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ టెట్ నుంచి మినహాయించకపోతే అత్యున్నత న్యాయస్థానం తీర్పు ప్రకారం వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం గాని, స్వచ్ఛంద పదవీ విరమణ చేయాల్సిన పరిస్థితి గాని ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అవసరమైతే సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేసేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వం చేపట్టాలని సూచించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు ప్రకటించాలని, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లను నగదుగా మార్చుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐఆర్ 30శాతం ప్రకటించడంతో బాటు తక్షణం 12వ వేతన సవరణ కమిటీని నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. విడతల వారీగా డీఏ బకాయిలు చెల్లించే సంస్కృతికి చరమగీతం పాడాలన్నారు. గత ప్రభుత్వంలో తమకు రావలసిన పీఆర్సీ, డీఏ బకాయిలు సర్వీస్ రిజిష్టరులో నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని త్రినాథబాబు కోరారు.

రాజమహేంద్రవరం అర్బన్: ఇన్ సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ గతంలో టెట్ రాయనివారు టెట్ ఉత్తీర్ణత సాధించాలనే సుప్రీంకోర్టు తీర్పుతో సీనియర్లు, మహిళా ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు సుప్రీంకోర్టులో రివ్యూ పిటీషన్ వేయాలని కోరుతున్నామని యూటీఎఫ్ పేర్కొన్నారు. డీఎస్సీ నిబంధనలకు అనుగుణంగానే గతంలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులై ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న వారు ఆ తర్వాత అనేక పర్యాయాలు శిక్షణ కార్యక్రమాలకు కూడా హాజరై శిక్షణ పొందారని వారు పేర్కొన్నారు.

9న కాపునాడు కార్తీక వన సమారాధన

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నవంబరు 9న జరిగే కాపునాడు కార్తీక వన సమారాధన ఆహ్వాన పత్రికను స్థానిక దేవిచౌక్ కాపునాడు కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గం విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల కాపునాడు అధ్య క్షుడు గుదే రఘు నరేష్, పిల్లా దుర్గాప్రసాద్, దేశినీడి రాంబాబు, ముమ్మిడి వీరబాబు, రుద్ర దుర్గాప్రసాద్, కాళ్ల చక్రరావు, బొమ్మల సత్యనారాయణ పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరిహారం అందజేత

బిక్కవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపురానికి చెందిన మేడిశెట్టి గోవిందమ్మ ఉపాధి పనులు చేస్తూ ఈ ఏడాది మార్చిలో గుండె పోటుతో మృతి చెందింది. దీంతో ఆ కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రభుత్వం అందించిన రూ.50 వేల పరిహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.శ్రీనివాస్, ఏపీవో అగస్టీన్‌కుమార్, ఈసీ సందీప్, ఎంపీటీసీ కేతా ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు అన్నదానం

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి జీవకారుణ్య సంఘంలో అనాథ పిల్లలకు ఆర్యాపురం బ్యాంక్ డైరెక్టర్ పడాల శ్రీనివాస్ అన్నదానం చేశారు. శుక్రవారం పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, సీసీసీ ఎండీ పంతం కొండలరావు పుట్టిన రోజు సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో జీవకారుణ్య సంఘంలో కేక్‌ను కట్ చేయించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో నామన వాసు, ఆకుల ఈశ్వరరావు, మేలుబండి బాలాజీ, శాఖ సత్తిరాజు, తిరుమలశెట్టి శ్రీనివాస్, పిన్నమరెడ్డి శ్రీనివాస్, కోడి రామకృష్ణ పాల్గొన్నారు.

నాగేంద్రుడి పుట్ట ప్రారంభం

అనపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనపర్తి శివారు కొత్తూరులోని నాగేంద్ర స్వామి పుట్ట ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. రజకుల ఆరాధ్య దైవమని నాగేంద్ర స్వామికి కనక దుర్గ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో పుట్ట నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా పుట్ట వద్ద నిర్మించిన శాలను నేత్ర వైద్యులు తేతలి సత్యనారాయణరెడ్డి మస్తానమ్మ దంపతులు ప్రారంభించగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో షుగర్ వ్యాధి నిపుణుడు డాక్టర్ తాడి రామగురెడ్డి, కూటమి నాయకులు కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి పాల్గొన్నారు.

అనపర్తిలో కుక్కల స్వైర విహారం

» ఒక్క రోజులోనే నలుగురిపై దాడి
» ఏరియా ఆసుపత్రికి క్యూ కడుతున్న బాధితులు
» నెలకు 100-150 కేసులు: సూపరింటెండెంట్


అనపర్తిలో తిరుగుతున్న కుక్కలు

అనపర్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అనపర్తి పరిసర గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అనేక మందిపై దాడులు చేయడంతో బాధితులంతా అనపర్తి ఏరియా ఆసుపత్రికి క్యూ కడుతున్నారు. శుక్రవారం ఒక్క రోజే నలుగురు బాధితులు అనపర్తి ఏరియా ఆసుపత్రికి రావడం కుక్కల తీవ్రతకు అద్దం పడుతోంది. శుక్రవారం అనపర్తికి చెందిన దిండి శ్రీదేవి, ఎన్.నీరజారెడ్డి, మహేంద్రవాడకు చెందిన చిర్ల నాగమణి, బిక్కవోలుకు చెందిన జి.శివరామకృష్ణ కుక్కల దాడిలో గాయపడి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రుళ్లు బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. చిన్నారులను ఇంటి నుంచి బయటకు పంపేందుకు తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. కుక్కల సంఖ్య పెరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి మాట్లాడుతూ కుక్క కాటు కేసులు నెలకు 100-150 వస్తున్నాయని, ఎప్పటికప్పుడు యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్లు సరిపడ తెప్పించి ఉంచుతున్నామన్నారు. ఒక్కొక్క కేసులో తీవ్ర గాయాలపాలైన వారు కూడా వస్తున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం తమ వద్ద నలుగురు చికిత్స పొందుతున్నారని అన్నారు.


బాధితురాలికి చికిత్స అందిస్తున్న డాక్టర్ రామగురెడ్డి

నిరుద్యోగులను మభ్యపెడుతున్న ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్రాధ్యక్షుడు రాజేంద్రబాబు

రౌండు టేబుల్ సమావేశంలో వక్తలు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోందని, ప్రభుత్వం నిరుద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపుతూ మభ్య పెడుతోందని పలువురు పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో పెరుగుతున్న నిరుద్యోగం-తగ్గుతున్న ఉద్యోగ ఉపాధి అవకాశాలు అనే అంశంపై రౌండు టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ గండాల సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో తూర్పుగోదావరి జిల్లాలో జరిగిన సభలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని వరాల జల్లు కురిపించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత యువతకు ఉద్యోగాలు, ఉపాధి కలగా మిగిలిపోయిందన్నారు. వలంటీర్లను, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న నిరుద్యోగులను, ప్రభుత్వ రేషన్ వాహనాల్లో పనిచేసే డ్రైవర్లు, హెల్పర్లను తొలగించి ఉపాధి లేకుండా చేశారని ఆరోపించారు. నిరుద్యోగ భృతి ఊసేలేదని అన్నారు. కాగా, జిల్లాలో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని కోరుతూ ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎఫ్ఐడబ్ల్యు సంఘాలతో జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ఆందోళనలు చేపడతామని, నవంబరు 6న జిల్లాస్థాయి నిరుద్యోగి ఆవేదన సదస్సు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు అధ్యక్షత వహించారు. ఏఐఎస్ఎఫ్ చింతలపూడి సునీల్, ఎస్ఎఫ్ఐ భాస్కర్, డీవైఎఫ్ఐ రాంబాబు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య లావణ్య తదితరులు పాల్గొని మాట్లాడారు.

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టాలి

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి
సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యార్థినులు, ఆడపిల్లలు, మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోయాయని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. హాస్టల్ విద్యార్థినిపై అత్యాచార ఘటనను నిరసిస్తూ శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయన ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇలాంటి అమానుష ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం, వివిధ శాఖల అధికారులు పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా కళాశాలలు, మహిళా హాస్టల్స్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, నాయకులు మేడవరపు భద్రం దొర, శ్రీనివాస్ వడయార్, చిన్న మురళీకృష్ణ, జేటీ రామారావు, పట్టాభి, బత్తిన చంద్రరావు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థుల ర్యాలీ

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తునిలో బాలికపై జరిగిన అమానుష సంఘటనతోపాటు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఆదిత్య కళాశాల విద్యార్థులు 300 మంది నగర వీధుల్లో ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్ ప్రారంభించిన ఈ ర్యాలీలో మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్స్ మంగాదేవి, అమీనా బేగం, శక్తి టీం సభ్యులు, ఎన్ఎస్ఎస్ పీవోలు జీవీఎస్ నాగేశ్వరరావు, పి.సాయి, బీహెచ్ రమాదేవి పాల్గొన్నారు.


నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదిత్య కళాశాల విద్యార్థులు

బాలికల వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో అవగాహన కార్యక్రమం


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమ శాఖాధికారి శ్రీదేవి

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బాలికల వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి టి.శ్రీదేవి అన్నారు. మంచి స్పర్శ చెడు స్పర్శల మధ్య తేడా తెలుసుకోవడం ద్వారా తమను తాము రక్షించుకోవచ్చని వివరించారు. శుక్రవారం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు వద్దనున్న బీసీ బాలికల హాస్టల్‌లో బాలల సంరక్షణ-వ్యక్తిగత భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భం గా శ్రీదేవి మాట్లాడుతూ మంచి స్పర్శ అనేది తల్లిదండ్రుల ప్రేమలో మాత్రమే లభిస్తుందని, అసౌకర్యం కలిగించే, అసహ్యం అనిపించే స్పర్శను వెంటనే డోంట్ టచ్ అని నిరాకరించాలని వివరించారు. ఎక్కడైనా బాల్యవివాహం జరుగుతున్నట్టు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు సమాచారం ఇవ్వాలన్నారు. పోక్సో చట్టం-2012, బాల్యవివాహ నిషేధ చట్టం-2006 గురించి వివరించారు. జిల్లా బీసీ వెల్ఫేర్, సాధికారత అధికారిణి బి.శశాంక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఆర్.అనంత ప్రదీప్, ప్రొటెక్షన్ ఆఫీసర్ క్రాంతిలాల్, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ముత్యాల సుబ్బారావు, హాస్టల్ వెల్ఫేర్ అధికారిణి సూర్యకుమారి, తదితరులు పాల్గొన్నారు.

నరసన్న ఆలయంలో కార్తీక మాసం పూజలు

కోరుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి కార్తీక దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి స్వామి వారిని దర్శించుకుని కొండ దిగువన దీపాలు వెలిగించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అన్నదానానికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌తో ఎన్నో ప్రయోజనాలు


బిక్కవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డిజిటల్ బ్యాంకింగ్ ద్వారా ఎన్నో ప్రయోజనాలున్నాయని అనపర్తి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ కె.సిద్ధార్థ అన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ సబ్జెక్టులో భాగంగా శుక్రవారం బ్యాంకును సందర్శించారు. ఈసందర్భంగా బ్యాంకింగ్ సర్వీసెస్‌పై సిబ్బంది విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో వొకేషనల్ టీచర్లు కరుణ, రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: తమ్మా
సూర్యమినీ	: ఓజీ
సూర్యప్యాలస్	: బైసన్
స్వామి	: తెలుసు కదా
అనుశ్రీ(సాయికృష్ణ)	: కె-ర్యాంప్
శివజ్యోతి	: డ్యూడ్
రాజా	: డ్యూడ్
ఊర్వశి	: సలార్
మేనక	: తమ్మా
రంభ	: విద్రోహి
అప్సర	: కాంతారా-1
అశోక	: డ్యూడ్
వీఎస్ మహల్(నామవరం)	: కె-ర్యాంప్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: డ్యూడ్
వెంకటసూర్య(కడియం)	: కె-ర్యాంప్
సత్యగౌరి (అనపర్తి)	: డ్యూడ్
సూర్యశ్రీ (అనపర్తి)	: కె-ర్యాంప్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: డ్యూడ్
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: కె-ర్యాంప్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: తెలుసు కదా
లలితామహల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
శనివారం 25 అక్టోబరు 2025 | 5





తనిఖీ చేస్తున్న లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్

కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో..

ముగ్గురు ఉమ్మడి జిల్లావాసులు

రావులపాలేనికి చెందిన క్రేన్ ఆపరేటర్ మృతి

బిక్కవోలు, కాకినాడకు చెందిన ఇద్దరు సురక్షితం



మృతుడు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి (ఫైల్)

రావులపాలెం/ అనపర్తి, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో గురువారం అర్ధరాత్రి జరిగిన కావేరి బస్సు దగ్ధం ఘటనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ముగ్గురు చిక్కుకున్నారు. వీరిలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలేనికి చెందిన కొవ్వూరి శ్రీనివాసరెడ్డి(39) క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. క్రేన్ పని నిమిత్తం రెండు రోజుల కిందట ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లాడు. బెంగళూరులో వేరే పని ఉండడంతో గురువారం రాత్రి కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఎక్కాడు. ఈ దుర్ఘటనలో శ్రీనివాసరెడ్డి అగ్నికి ఆహుతై మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీజ్యోతి, 8వ తరగతి చదువుతున్న కుమారుడు వెంకటరెడ్డి, 3వ తరగతి చదువుతున్న కుమార్తె దివ్య ఉన్నారు. మృతుడి తండ్రి, మావయ్య కూడా అతడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇదే దుర్ఘటనలో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన మల్లిడి గంగాధర రామారెడ్డి తృటిలో తప్పించుకుని మృత్యుంజయుడిగా నిలిచాడు. అనపర్తిలోని ఎంఎస్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు మల్లిడి నారాయణరెడ్డి కుమారుడైన రామారెడ్డి తన కుమార్తె చదువు కోసం బెంగళూరులో ఉంటున్నాడు. ఆయన వ్యాపార రీత్యా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరచూ ప్రయాణిస్తుంటాడు. శుక్రవారం తన పుట్టినరోజు కావడంతో ఎట్టిపరిస్థితిలోను బెంగళూరు వెళ్లాలనుకుని గురువారం రాత్రి అప్పటికప్పుడు బస్సు టికెట్ తీసుకుని బయలుదేరాడు. చివరి నిమిషంలో టికెట్ దొరకడంతో ఆఖరి వరుసలో సీటు దొరికింది. చివరికి అదే ఆయన ప్రాణాలు కాపాడింది. పక్క ప్రయాణికులు పగలగొట్టిన ఎమర్జెన్సీ డోరు నుంచి కిందకు దూకి ప్రాణాలు దక్కించుకున్నానని మల్లిడి గంగాధర రామారెడ్డి ఫోన్‌లో ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇదే ఘటనలో బయటపడిన కాకినాడకు చెందిన జి.సత్యనారాయణ ప్రస్తుతం కర్నూలులోని ఆకాశ్ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.



మల్లిడి గంగాధర రామారెడ్డి క్షతగాత్రుడు

రాయవరం బాధితులకు చెక్కుల పంపిణీ

- ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుంది : మంత్రి సుభాష్
- చెక్కులు పంపిణీ చేసిన మంత్రి, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల
- మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం
- యజమాని తరపున ఒక్కొక్కరికి 2.50 లక్షలు అందజేత

8

‘ఎంఆర్‌పీకి మించి అమ్మితే చర్యలు’

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు ఎంఆర్‌పీకి మించి ధరలకు విక్రయాలు చేస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్‌మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో స్టాల్స్‌లో ఎంఆర్‌పీకి మించి విక్రయాలు చేస్తున్నట్టు సమాచారం అందడంతో జిల్లా వినియోగదారుల రక్షణ మండలి సభ్యుడు గొట్టిముక్కల అనంతరావుతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో ఎంఆర్‌పీకి మించి ధరలకు అమ్ముతున్న స్టాల్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ లీగల్ అండ్ మెట్రాలజీ జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ సాయిరామ్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వ్యాపారస్తులు ఏ వస్తువునైనా ఎంఆర్‌పీ ధరకు మించి అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. ఎంఆర్‌పీ ధరలకు మించి వ్యాపారాలు అమ్మకాలు చేస్తే రాజమహేంద్రవరం గానుగవీధిలో ఉన్న జిల్లా లీగల్ మెట్రాలజీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులకు సూచించారు. అనంతరరావు మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వినియోగదారులు ధైర్యంగా ప్రశ్నించి మోసాలను అరికట్టాలని కోరారు. కొనుగోలు సమయంలో వస్తువు ఎమ్మార్పీ తయారీ, గడువు తేదీలు తయారి సంస్థ చిరునామా వంటి వివరాలు సరిచూసుకోవాలన్నారు. మోసపోతే వినియోగదారుల కమిషన్‌లో కేసు వేసి నష్టపరిహారం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు పాల్గొన్నారు.



బాబోయ్.. బస్!

- ప్రమాదకరంగా ప్రైవేటు బస్సుల ప్రయాణం
- గాల్లో కలిసిపోతున్న ప్రాణాలు
- నిబంధనలు విస్మరిస్తున్న ట్రావెల్స్ యాజమాన్యాలు
- రికార్డులు పరిశీలించి చేతులు దులుపుకొంటున్న రవాణాశాఖ
- ప్రయాణికుల భద్రత విషయంలో చర్యలు శూన్యం
- రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ ఇతర రాష్ట్రాల్లో..
- అనధికారికంగా స్లీపర్లు ఏర్పాటు
- అనుభవం లేని డ్రైవర్లు

హైదరాబాద్, బెంగళూరు, చెన్నై.. ఎక్కడికైనా వెళ్లాలా? ఠక్కున ఆన్‌లైన్ ఓపెన్ చేయగానే ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల లిస్టు ప్రత్యక్షమవుతుంది. ప్రయాణికులు ఒక్క క్లిక్‌తో సీటు లేదా బెర్త్ బుక్ చేసేసుకుంటున్నారు. తీరా బస్సు ఎక్కిన తర్వాత ఇరుకు సీట్లు, అటు ఇటు కదిలే చోటుండదు. మధ్యలో ఉన్న దారి కుచించుకుపోయి ఉంటుంది. ఎవరైనా ఒక బ్యాగ్ ఆ దారిలో పెడితే ఇక అంతే.. దానిపై నుంచి దూకాల్సిందే. అత్యవసర ద్వారం ఎక్కడ ఉందో వెతుక్కునే లోపుగా ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. అధికారులు తనిఖీలు చేస్తున్నా.. జనం ప్రాణాలు పోతున్నా ప్రైవేటు ట్రావెల్స్(కాంట్రాక్ట్ క్యారియర్స్) బస్సుల తీరు మాత్రం మారడం లేదు. ఆకర్షణీయమైన రంగులు, హంగులకు ప్రాధాన్యం ఇస్తూ భద్రతను గాలికొదిలేస్తున్నారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో కర్నూలు వద్ద శుక్రవారం మంటలు చెలరేగి పలువురు సజీవదహనమైన సంఘటనతో జనం ఉలిక్కిపడ్డారు. ఒక బైక్ ఢీకొంటే బస్సు మొత్తం తగలబడిపోయేంత నిర్లక్ష్యానికి ఎవరు బాధ్యులని బలైపోయిన ప్రాణాలు మౌనంగా ప్రశ్నిస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి - రాజమహేంద్రవరం/కాకినాడ/ అమలాపురం)

రైళ్లలో రిజర్వేషన్ దొరకడం గగనమైపోయింది. ఆర్టీసీ ట్రావెల్ బస్సులూ అరకొరే. దీంతో ప్రైవేటు ట్రావెల్ బస్సులే చాలామందికి దిక్కు. పైగా టిక్కెట్ ఆన్‌లైన్ ద్వారా ఒక్క క్లిక్‌తో పొందొచ్చు. ఇదివరకు ప్రైవేటు ట్రావెల్ బస్సులు ఏసీ, నాన్ ఏసీ పేరిట నడిచేవి. అన్నీ సీట్లే. ప్రస్తుతం వాటి స్థానంలో స్లీపర్ కోచ్‌ల హవా నడుస్తోంది. 40 సీట్ల వరకు ఉంటున్నాయి. ఇక స్లీపర్ బస్సుల్లో 2బై1 సీటింగ్ ఉంటుంది. 30 నుంచి 36 బెర్త్‌లు ఉంటాయి. అదే మల్టీయాక్సిల్ బస్సులైతే 36-40 మంది ప్రయాణించవచ్చు. ఒక్కో బెర్త్ ఆరడుగుల పొడవు, 2.6 అడుగుల వెడల్పుతో ఉంటుంది. అయితే బెర్త్‌లను అనుసంధానించే గ్యాలరీ ఒక మనిషి మాత్రమే వెళ్లేలా చాలా ఇరుకుగా ఉంటుంది. ప్రమాదాల సమయంలో ప్రయాణికులు ఈ ఇరుకు ప్రాంతం నుంచి బయటకు రావడం దాదాపు అసాధ్యం. దీనివల్లే ప్రమాదం జరిగినప్పుడు ఎక్కువ మంది లోపల చిక్కుకుపోతున్నారు. స్లీపర్ బస్సుల ఎత్తు కూడా మరో సమస్య. సాధారణంగా వీటి ఎత్తు 8-9 అడుగుల వరకు ఉంటోంది. ఒకవేళ బస్సు ఒకవైపునకు ఒరిగితే ప్రయాణికులు కిటికీలను, ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లను చేరడం కష్టమవుతోంది. సాధారణంగా 300 నుంచి వెయ్యి కిలోమీటర్ల దూరం ఉండే ప్రయాణాలకు స్లీపర్ బస్సులను అధికంగా వినియోగిస్తున్నారు. ఈ బస్సుల్లో రాత్రి వేళల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తాయి. దీంతో డ్రైవర్‌కు అలసట, మగత వచ్చే ముప్పు కూడా ఎక్కువగా ఉంటుంది. అధునాతన బస్సుల్లో డ్రౌజీనెస్ అలర్ట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేస్తున్నా వాటి పనితీరు సామర్థ్యంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డ్రైవింగ్ సమయంలో అర్ధరాత్రి తర్వాత నుంచి తెల్లవారుజాములోపు కొందరు నిద్రలోకి జారుతున్నారు.

● అంతా ప్రైవేటు బస్సుల హవాయే..

● తూర్పుగోదావరి జిల్లాలో.. రోజూ 30 బస్సుల వరకూ ప్రైవేటు ట్రావెల్స్ తిరుగుతున్నాయి. వీటిలో హైదరాబాద్ సర్వీసులు ఎక్కువ. విశాఖ, బెంగళూరు సర్వీసులూ ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచీ ఇప్పటివరకూ రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో తనిఖీలుచేసి 218 కేసులు రాసి రూ.18 లక్షలు జరిమానా వసూలు చేశారు. ఒక బస్సుకు ఏకంగా రూ.6 లక్షలు ఫైన్ వేశారు. పన్ను చెల్లించ కుండా తిరిగేస్తున్న 9 బస్సులను సీజ్ చేశారు. ఫైర్ ఎగ్జిస్టింగ్విషర్లు లేకపోవడంతో 85, సీట్లు ఆల్ట్రేషన్ చేసినవి 42 కేసులు రాశారు.

● కాకినాడ జిల్లాలో.. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి ప్రాంతాలకు సుమారు 30కిపైగా బస్సులు వెళుతుంటాయి. సీజనల్‌గా వీటి సంఖ్య మారుతుంటుంది. దాదాపుగా ఈ ప్రైవేటు బస్సులన్నీ స్టేజ్ క్యారియర్లుగానే తిరుగుతున్నాయి.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో.. నిత్యం 30కు పైగా బస్సులు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలకు వెళుతుంటాయి. స్లీపర్‌కు డిమాండ్ పెరగడంతో వారు ఆడింది ఆట, పెట్టిందే రేటుగా దోచుకుంటున్నారు. ట్రావెల్స్ బస్సులు విపరీతమైన వేగంతో నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరిగి చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు.

● ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు

గతంలో ఏ రాష్ట్రంలోని వాహనాలు అదే రాష్ట్రంలో రిజిస్ట్రేషను చేయించుకోవడం జరిగేది. కేంద్ర ప్రభుత్వం ఆల్ ఇండియా పర్మిట్(ఏఐపీ) వాహనాలు ఏ రాష్ట్రంలోనైనా రిజిస్ట్రేషను చేయించుకోవచ్చని వెసులుబాటు ఇవ్వడంతో అప్పటి నుంచీ నెంబరు ప్లేటుపై ఏపీ తగ్గిపోయి ఏఆర్, డీడీ వంటివి కనిపిస్తున్నాయి. మన రాష్ట్రంలో ఒక్కో సీటుకు రూ.3,750 చొప్పున ప్రతి మూడు నెలలకు ఒకసారి చెల్లించాలి. అంటే 40 సీట్లు ఉన్న బస్సుకు సుమారు రూ.1.50 లక్షలు చెల్లించాలి. అంటే ఏడాదికి రూ.6 లక్షలు. అదే ఈశాన్య రాష్ట్రాలతోపాటు డామన్‌డయ్యూలో అయితే దీనిలో నాలుగో వంతు చెల్లిస్తే సరిపోతుంది. దీంతో ఇతర రాష్ట్రాల్లో పర్మిట్లు తీసుకొని ఇక్కడ తిప్పుతున్నారు. చాలా రాష్ట్రాలు పర్మిట్ ఫీజు తగ్గించినా మన రాష్ట్రంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. వాహన సామర్థ్యం (ఫిట్‌నెస్/బ్రేక్) విషయంలోనూ గజిబిజే. ఎక్కడ రిజిస్ట్రేషను చేయించుకుంటే అక్కడే ఈ తనిఖీలు చేసి సర్టిఫికెట్ జారీచేస్తారు. ఇవి కూడా చాలావరకు సృష్టించుకున్నవే.



కాకినాడలో ఓ బస్సుకు ఉన్న ఎమర్జన్సీ ఎగ్జిట్ డోర్

● నిబంధనలు గాలికి..

పర్మిట్ ఇచ్చినప్పుడు ఎన్ని సీట్లు, ఎన్ని స్లీపర్లు వంటివి పొందుపరుస్తారు. కానీ చాలా బస్సుల్లో వీటి ఉల్లంఘన జరుగుతోంది. డ్రైవరు వెనుక జాగాను కూడా వదిలిపెట్టడంలేదు. ఒక్కో బస్సులో రెండు మూడు సీట్లు అనధికారికంగా ఆల్ట్రేషన్ చేయించుకొని ఏర్పాటుచేస్తున్నారు. ఒక్క సీటు అదనంగా వేసుకున్నా రోజుకు రూ.3-4వేల వరకూ గిట్టుబాటు అవుతుంది. సీట్లను స్లీపర్లుగా అనధికారికంగా మార్పులు చేస్తున్నారు. కర్నూలులో ఘోర అగ్ని ప్రమాదానికి గురైన బస్సు కూడా సీట్ పర్మిషన్ ఉండగా, స్లీపర్‌గా మార్చినట్టు చెబుతున్నారు. అయినా వీటిపై అధికారులు దృష్టి సారించలేదు. దాదాపుగా అన్ని బస్సులకు స్లీపర్ సౌలభ్యం ఉంటోంది. వీటిలో ఎన్నింటికి అనుమతులున్నాయో తెలియని పరిస్థితి ఉంది. అత్యవసర ద్వారా కనబడకుండా ఏదోవిధంగా మూసేస్తున్నారు. దీంతో అత్యవసర సమయంలో ముందర బాగంలో ఉన్న ఒకే ద్వారం గుండా దిగాల్సి రావడంతో ప్రమాద తీవ్రత పెరుగుతోంది. ఏసీ బస్సుల్లో అత్యవసర సమయంలో అద్దంబద్దలు కొట్టడానికి సుత్తి ఉండాలి. కానీ అది సుత్తిమాటగానే పట్టించుకోవడం లేదు. ఇక డ్రైవర్లకు అనుభవం ఉందా? అంటే సందేహమనే సమాధానం వినవస్తోంది. ఒక్కో బస్సుకు ఇద్దరు డ్రైవర్లు ఒక క్లీనరు ఉంటారు. సగం దూరం ఒకరు నడిపితే, మరొక సగం దూరం మరొకరు నడపాలి. కానీ అదీ అమలు కాదు. క్లీనరుకు బస్సు డ్రైవింగ్ అలవాటు చేయడం కోసం డ్రైవింగ్ సీట్లో కూర్చోబెడుతున్నారు. కొందరు డ్రైవర్లు సిటీలు దాటిన తర్వాత మద్యం సేవిస్తున్నారు. అలాగే పగలు మద్యం తాగడంతో ఆ మగతతోనే రాత్రి బస్సును తీస్తున్నారు. ఉదాహరణకు బస్సు ఉదయం హైదరాబాద్ చేరిన తర్వాత పార్కింగ్ చేస్తారు. అక్కడ వంట చేసుకొంటారు. ఈ క్రమంలో కొందరు మద్యం తాగడం తప్పనిసరిగా మారింది. ఆ మత్తు దిగకుండానే రాత్రి తిరుగు పయనమవుతున్నారు. అడుగడుగునా తనిఖీలు చేయడానికి వీలుపడదు. అదే ఆసరాగా ఇష్టానుసారం తంతు కొనసాగిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో భద్రతాపరమైన ఉల్లంఘనలు తీవ్రంగా జరుగుతున్నాయి. బస్సుల్లో సరుకులు ఏమేమి రవాణా చేస్తున్నారో కూడా పట్టించుకొనే నాథుడు ఉండడు. చాలా బస్సులు లారీల మాదిరిగా సరుకు రవాణా చేస్తున్నాయి. ఫైర్ అలారం, ఫైర్ ఎగ్జిస్టింగ్విషర్లు (అగ్నిమాపక సిలిండర్లు) ఉండనే ఉండవు. సీట్ల ఆల్ట్రేషన్ ఎక్కువగా జరుగుతోంది.

● అధికారులేమంటున్నారంటే..

కాకినాడ జిల్లాలో ప్రైవేటు ట్రావెల్స్ విషయంలో కఠినంగానే వ్యవహరిస్తున్నామని కాకినాడ రవాణాశాఖ ఉపకమిషనర్ శ్రీధర్ చెప్పారు. ప్రజలు కూడా ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా ఉందా? లేదా అనేది అవగాహనతో ఉండాలన్నారు. తూర్పుగోదావరి జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ మాట్లాడుతూ అన్ని బస్సుల్లో భద్రతా ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండాలని, సిట్టింగ్ ఆల్ట్రేషన్ చేయకూడదని, ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల్లో సోదాలు చేయడానికి చర్యలు తీసుకున్నామని ‘ఆంధ్రజ్యోతి’తో చెప్పారు.



గోదావరి పుష్కర ప్రణాళిక సన్నద్ధతపై అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి చేకూరి.. పక్కన ఎస్పీ, కమిషనర్.. హాజరైన అధికారులు

2027 గోదావరి పుష్కరాల నిర్వహణకు సమగ్ర కార్యాచరణ

కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడానికి సమగ్ర కార్యాచరణ అవసరం. దీనికి అన్ని శాఖల సమన్వయంతో అందరూ కలసి పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె గోదావరి పుష్కరాలకు సంబంధించిన ప్రణాళికలు, సన్నద్ధతపై సమీక్షించారు. పోలీసు, టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో పుష్కరాల నేపథ్యంలో చేపట్టనున్న ఏర్పాట్లను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గత పుష్కరాల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని వచ్చే పుష్కరాల మరింత విజయవంతంచేయాలన్నారు. ఆరుకోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు చేయనున్నారనే అంచనా ఉండడం వల్ల మౌలిక సదుపాయాలు, క్రౌడ్ మేనేజ్మెంట్, రవాణా వ్యవస్థ, వసతి, ఆహారం, వైద్య సేవలు, స్వచ్ఛత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆమె ఆదేశించారు. ట్రాఫిక్, క్రౌడ్, డిజాస్టర్ మేనేజ్మెంట్ వంటి వాటిపై పోలీసుశాఖ రూపొందించిన ప్రణాళికలను మరింత శాస్త్రీయంగా అమలుచేయాలని సూచించారు. పుష్కరాల దృష్ట్యా పట్టణంలోని సుమారు 25 ప్రధాన రోడ్ల విస్తరణ ప్రతిపాదనలు ఉన్నాయని, వీటిలో తూర్పు రైల్వే స్టేషన్, ఎయిర్‌పోర్టు, కాతేరు, మోరంపూడి నుంచి సరస్వతి ఘాట్ రోడ్డు, కోటిలింగాలఘాట్ రోడ్డు మార్గాల విస్తరించి ట్రాఫిక్ సమస్యలేకుండా భక్తుల రాకపోకలు సులభతరం చేయవచ్చన్నారు. రాజమహేంద్రవరం నగరంలోని ఖాళీ స్థలాలను గుర్తించి పార్కింగ్ జోన్లు, తాత్కాలిక వసతి గృహాలు, ఆహార పంపిణీ కేంద్రాలు, సాంస్కృతిక కార్యక్రమాల వేదికలు ఏర్పాటుచేయాలన్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం నగరంలో 34 ఘాట్లు, కొవ్వూరు నియోజకవర్గంలో 31 ఘాట్లు కలిపి మొత్తం 65 గోదావరిఘాట్లు ఉన్నాయని, ఇవి 2.7 కిలోమీటర్ల మేర ఉన్నాయన్నారు. కొత్తగా 1.95 కిలోమీటర్ల మేర ఘాట్లను విస్తరించడం, నిర్మించడం ద్వారా మొత్తం 4.7కిలోమీటర్ల మేర ఘాట్లను అందుబాటులోకి తేనున్నట్టు చెప్పారు. ధవళేశ్వరం నుంచి సీతానగరం వరకూ గోదావరి ఫ్లడ్ బ్యాంక్ రహదారి అభివృద్ధి చేయడం ద్వారా రాజమండ్రిలో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుందని ఇరిగేషన్ అధికారులు వివరించారు. పుష్కరాలు వర్షాకాలంలో జరిగే అవకాశం ఉన్నందు వల్ల వరదల ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీ సిస్టమ్, ఘాట్ల స్థిరత్వం, భక్తుల భద్రత వంటి అంశాలపై సమగ్ర ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్, మున్సిపల్ నగర కార్పొరేషన్ కమిషనర్ రాహుల్ మీనా, డీఆర్వో టి.సీతారామమూర్తి, ఆర్డీవోలు రాణి సుస్మిత, ఆర్.కృష్ణనాయక్, ఆర్ఎంసీ అదనపు కమిషనర్ రామలింగేశ్వర్‌తోపాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి ఫణిభూషణ్‌రెడ్డి

4 లారీలు సీజ్

కొవ్వూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక మార్గదర్శకాలను ఉల్లంఘించిన, పరిమితికి మించి ఇసుక రవాణా చేసినవారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు దొండగుంట రేవు డీసిల్టేషన్ ఇసుకర్యాంపులో మైనింగ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పరిమితికిమించి అధికలోడ్‌తో వెళ్తున్న నాలుగు లారీలను గుర్తించి సీజ్ చేసి కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. అలాగే ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం రాజవరం గ్రామానికి చెందిన పబ్బతిరెడ్డి సుధీర్‌రెడ్డి మూడు లారీల్లో (ఒక్కొక్క లారీలో 36 టన్నులు) ఇసుక రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. దొండగుంట ర్యాంపు నుంచి రాజవరం పేరుతో ఇసుక రవాణా చేస్తున్న మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తనిఖీల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి.జ్యోతిర్మయి, ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు పాల్గొన్నారు.



కడియం ఆవలో వరిపొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్, సిబ్బంది

నేలనంటిన వరి చేలు

వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలు

అనపర్తి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు, ఈదురు గాలులకు అనపర్తి మండలంలో సుమారు 500 ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని ఏవో సురేష్ తెలిపారు. మండలంలో 8,900 ఎకరాల్లో వరి పంట వేశారని... కొన్నిచోట్ల ప్రస్తుతం గాలులు ఎక్కువగా ఉండడంతో వరి పనలు నేలకొరుగుతున్నాయని ఆయన తెలిపారు. గింజ పూర్తిగా నీటిలో ఉంటే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని, రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. నాలుగైదు మొనలను ఒక్కటిగా చేసి నిలబెట్టి కట్టుకోవాలని ఆయన సూచించారు. గట్టిపడిన గింజ ఎక్కువ రోజులు నీటిలో నానితే రంగు మారే ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటిస్తే నష్టం ఉండదని అన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలంటూ రైతుల వినతిపత్రం

బిక్కవోలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా బిక్కవోలులో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరిపంట నేలకొరిగింది. పదిరోజుల్లో పంట చేతికొస్తుందన్న తరుణంలో వరి చేలు నేలకొరగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం మొత్తం మీద తొలకరిలో 15వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అయితే ఈ అకాల వర్షాలకు రెండు వేల ఎకరాలకు పైగా వరిపంట నేలకొరగడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. ఇంకో రెండు రోజులు ఇదే మాదిరిగా వర్షాలు కురిస్తే పొలంలోను వరి మొలకలు వచ్చే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులు శుక్రవారం తమ పంటకు నష్టపరిహారం అందజేయాలంటూ కూటమి నేతలతో కలసి తహశీల్దార్ సత్యకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పల్లి వాసు, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, రైతులు వల్లూరి రామకృష్ణచౌదరి, దాసరి నూకరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై మండల వ్యవసాయాధికారి ఎస్ శామ్యూల్‌జాన్‌ను వివరణ కోరగా ఎంటీయూ 13-18 రకం పడలేదని, స్వర్ణరకం పంట నేల కొరిగిందన్నారు. ముఖ్యంగా పాలుపోసుకునే దశలోను, గింజ గట్టిపడే దశలో ఉన్న వరి నేలకొరిగిందన్నారు. నష్టం అంచనా వేసేందుకు కమిటీలు వేసి పొలాల్లో పర్యటిస్తామన్నారు. అనంతరం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని వివరించారు.

వరి పొలాల పరిశీలన

కడియం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వరి రైతులు వర్షపునీరు బయటకు పోయే మార్గం ఏర్పాటు చేసుకోవడంతోపాటు జాగ్రత్తలు తీసుకుంటే పంట కాపాడుకోవచ్చని వ్యవసాయాధికారి పీవీ శ్రీనివాస్ తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కడియం ఆవ ప్రాంతంలో నేలకొరిగిన వరిపంటను ఆయన పరిశీలించారు. సుమారు 67 హెక్టార్లలో వరి పంట నేలవాలిందని శ్రీనివాస్ తెలిపారు. గింజ తోడుకునే సమయంలో, వెన్ను బరువు వల్ల పంట కణుపుల వద్ద విరిగి పంట నేలకొరుగుతుందన్నారు. ఈ విధంగా పడిపోవడం వల్ల పిండి పదార్థం గింజకు సక్రమంగా చేరకుండా గింజ బరువు తగ్గడం, తాలు గింజలు ఏర్పడటం జరుగుతుందన్నారు. దీనివల్ల పంట దిగుబడి తగ్గుతుందన్నారు. పడిపోయిన వరి దుబ్బులను నిలకట్టుకోవాలని ఆయన సూచించారు.

ధాన్యం కొనుగోలుకు ప్రణాళికలు : ఏడీ

కోరుకొండ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కోరుకొండ వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ అసిస్టెంట్ డైరెక్టర్ జె శశిబిందు తెలియజేశారు. ఆమె విడుదల చేసిన ప్రకటనలో వివరాలు తెలియజేశారు. కోరుకొండ మండలంలో 5625హెక్టార్లు సాగు విస్తీర్ణం కాగా, 41369 మెట్రిక్ టన్నులు దిగుబడి ఉంటుందని, ఇందుకోసం 17ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు తెలియజేశారు. నవంబర్ 5 నుంచి డిసెంబర్ 15 వరకు ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్టు తెలిపారు అదేవిధంగా గోకవరం మండలంలో 5688 హెక్టార్లు సాగు విస్తీర్ణం కాకా 42477మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేస్తూ 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. సీతానగరం మండలంలో 5550 హెక్టార్లు సాగు విస్తీర్ణం కాగా, 41166 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి ఉంటుందని ఇందుకోసం 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. నవంబర్ 15 వరకు సీతానగరం మండలంలో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. సార్వా సీజన్ 2025కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతాంగం నష్టపోకుండా ప్రభుత్వం నిర్ధారించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఆమె వివరించారు. సకాలంలో రైతుల ధాన్యం సొమ్ము వారిఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

'సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించండి'



నిడదవోలులో మంత్రికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నేత రాంబాబు

నిడదవోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నిడదవోలు అమృత భారత్ రైల్వేస్టేషన్‌లో జన్మభూమితో సహా మరికొన్ని సూపర్ ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ కల్పించాలని సీపీఎం నేత, పట్టణ ప్రజల సంక్షేమ సంఘం నాయకుడు జువ్వల రాంబాబు కోరారు. ఈ మేరకు శుక్రవారం నిడదవోలులో మంత్రి దుర్గేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ ఎంపీ పురందేశ్వరి చొరవతో అనపర్తి రైల్వేస్టేషన్‌లో జన్మభూమికి హాల్ట్ లభించినట్టు వార్తలు వస్తున్నాయని, ఎన్నోఏళ్లుగా నిడదవోలు జంక్షన్‌లో మాత్రం జన్మభూమికి హాల్ట్ కల్పించడం లేదన్నారు. దీనిపై స్పందించిన మంత్రి విజయవాడ డివిజనల్ రైల్వే మేనేజర్ మోహిత్ సోనాకియాతో ఫోన్‌లో మాట్లాడి జన్మభూమి, ఎల్‌టీటీ, తదితర ఎక్స్‌ప్రెస్‌లకు నిడదవోలు రైల్వే జంక్షన్‌లో హాల్ట్ కల్పించే విధంగా కృషిచేయాలని మంత్రి కోరినట్టు రాంబాబు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ పోలియో డే



జడ్పీ బాలికోన్నత పాఠశాలలో పోలియో డేను నిర్వహిస్తున్న దృశ్యం

నిడదవోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరి ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ పోలియో డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పోలియోపై అవగాహన పెంచుకుని పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు కృషిచేయాలన్నారు. ఈ సందరంగా సుమారు 800 మంది విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పిలిప్స్, వ్యాయామ ఉపాధ్యాయురాలు కృష్ణకు మారి, క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, ట్రజరర్ గుంటుపల్లి సత్యసాయి, గోపిరెడ్డి శ్రీనివాస్, ఎండీ ఫయాజ్, పొన్నా సుబ్రహ్మణ్య శర్మ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై విద్యార్థులకు మాక్ పోలింగ్



పంగిడి జడ్పీ హైస్కూల్లో మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పంగిడి జడ్పీ హైస్కూల్లోని విద్యార్థులకు శుక్రవారం ఎన్నికలపై మాక్‌పోలింగ్ నిర్వహించారు. దేశ్ అప్నాయేం సహయోగ్ ఫౌండేషన్ యాక్టిజెన్ క్లబ్ ఫార్మేషన్‌లో విద్యార్థులతో జరిపారు. పాఠశాల హెచ్‌ఎం ఎం.రామారావు మాట్లాడుతూ మాక్ ఎన్నికలు విద్యార్థులకు ఎంతో ప్రత్యక్ష జ్ఞానాన్ని అందజేస్తాయన్నారు. అజెండా అంటే ఏమిటి, నామినేషన్ ఎలా వేయాలి, నామినేషన్ ఉపసంహరణ, ఎన్నికల మ్యానిఫెస్టో, బ్యాలెట్ బాక్సును తయారు చేయడం, బ్యాలెట్ పేపర్స్, ఓటరు ఐడీ కార్డులు సొంతంగా చేయడం వంటి అంశాలను ప్రత్యక్షంగా చేసి అవగాహన కల్పించారు.

వర్షానికి నేలమట్టమైన వరి పంట



పసలపూడిలో వరి పంట నేలమట్టమైన దృశ్యం

ఉండ్రాజవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో పల్లపు ప్రాంతాల్లోని వరి చేలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 150 ఎకరాల్లో వరి నేలమట్టమైనట్టు అధికారులు చెబుతున్నారు. పసలపూడి, పాలంగి, వేలివెన్నులో పరిస్థితి దారుణంగా ఉంది. ఏవో రాజారావు మాట్లాడుతూ పనలు వర్షానికి తడిచినట్లైతే గింజ మొలకెత్తకుండా ఉండటానికి 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

పెరవలి: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పల్లపు భూముల్లో వర్షపు నీరు వచ్చి నిలిచిపోయింది. దీంతో వరి చేలు నేలమట్టకావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానూరు, పెరవలి, కానూరు అగ్రహారంలో సుమారు వంద ఎకరాలకు పైగా పంట నీటమునిగింది.

పోలియోపై అవగాహన

సీతానగరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) పోలియో వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కే. శైలజారాణి ఆధ్వర్యంలో పోలియోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలియో వ్యాధి వల్ల చిన్న పిల్లల్లో అంగవైకల్యం కలుగుతుందని ఇది రాకుండా ఉండడం కోసం పుట్టిన ప్రతి బిడ్డకి విధిగా పోలియో వ్యాక్సిన్ వేయించాలన్నారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటాం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ, తామంతా ఎప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కొవ్వూరు మండలానికి చెందిన 13 మందికి రూ. 5,23,000 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన చాగల్లు మండలం మార్కొండపాడుకి చెందిన ఉప్పులూరి శివలీల కుటుంబానికి పార్టీ నుంచి వచ్చిన ప్రమాదబీమా రూ. 5 లక్షలను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం కలిగిన కార్యకర్త ప్రమాదవశాత్తు మరణించినట్టయితే ఆ కుటుంబానికి బీమా అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, దాయన రామకృష్ణ, చావా శ్రీనివాసరావు, ఉప్పులూరి బాబ్జీ, బేతిన నారాయణ, అర్జిల్లి రామకృష్ణ, సుంకర సత్తిబాబు, మంకెన వీరన్న, మేణ్ణి పార్దు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే గ్రీవెన్స్‌కు ఎనిమిది ఫిర్యాదులు

గ్రీవెన్స్‌లో ప్రజలు తమ సమస్యలను రాత పూర్వకంగా అందించి పరిష్కరించుకోవచ్చునని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజల నుంచి ఎనిమిది ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతివారం గ్రీవెన్స్ నిర్వహించి, ప్రజల నుంచి వారి సమస్యలను తెలుసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ పూజలు



వాడపల్లిలో స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ వేదపండితులు

ఆత్రేయపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారిని శుక్రవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ దర్శించుకున్నారు. తొలుత అర్చక బృందం పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికింది. ప్రొటోకాల్ ప్రకారం తహశీల్దార్ పి.రాజేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బంధుమిత్రులతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖమండపంలో వేదపండితులు ఆశీర్వచనం తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు శేషవస్త్రం సమర్పించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

మహిళ అరెస్ట్

రంగంపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెంకటాపురంలో బెల్ట్‌షాపులపై శుక్రవారం ఎక్సైజ్ దాడులు నిర్వహించి దుళ్ల మరియమ్మ అనే మహిళ వద్ద నుంచి ఐదు మద్యం బాటిల్స్‌ను స్వాధీనపర్చుకుని, అలాగే అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ డీ.సుధ తెలిపారు.

డిగ్రీ కాలేజీలో వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దేవరపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం బీహెచ్‌ఎస్‌ఆర్ వీఎల్ఎం డిగ్రీ అండ్ పీజీ కాలేజీ ఆనంద్ విద్యా సంస్థల నందు 'ప్రస్తుతం ఉమెన్స్ పర్యవేక్షణ, సెల్ఫ్ డిఫెన్స్, ప్రస్తుతం పోలీస్ వ్యవస్థ పనితీరు' అనే అంశాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుబ్రహ్మణ్యం పాల్గొని 100 మంది విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ దినేశ్, కానిస్టేబుల్ ఆర్.వెంకట రమణ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి, కాకరపర్రు హైస్కూళ్లలో..

పెరవలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా పెరవలి, కాకరపర్రు హైస్కూల్ నందు శుక్రవారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ ఎస్ఐ సౌజన్య సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పలు విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆవపాడు అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్జేడీ సుజాత రాణి

నల్లజర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆవపాడు కోడ్ నెంబరు - 20లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏలూరు ఆర్జేడీ సుజాతరాణి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీడీపీవో మమ్మితో కలిసి రికార్డులు, స్టాక్ బ్యాలెన్స్ సరి చూశారు. రికార్డులు సరిగ్గా ఉండడంతో సంతృప్తి చెందారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, హారతి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఊనగట్ల విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం కొవ్వూరు పీఎంఆర్ మున్సిల్ హైస్కూల్లో జరిగిన ఎంపిక పోటీల్లో పంతకాని లాస్య (9వ తరగతి), కంచర్ల హనీ (7వ తరగతి)పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రీడాకారులు, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కొయ్య గంగాధరరావును పలువురు అభినందించారు. ప్రధానోపాధ్యాయుడు ఎన్వీ రమణ, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిగం శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు బొల్లిన శివనాగేంద్ర, ఎస్ఎంసీ చైర్మన్ కామన శివ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అండర్ - 14 రాష్ట్ర వాలీబాల్ జట్టుకు పంగిడి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఐ.పంగిడి జడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి కొడమంచిలి నందిని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టుకు ఎంపికయ్యింది. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మంగిన శ్రీరామారావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. ఉపాధ్యాయులు వీవీ శాస్త్రి, వీ.రవికుమార్, షేక్ రషీదా, సీఆర్‌పీ వెంకటరత్నం, పీడీ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఎంపిక

నిడదవోలు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు పట్టణానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి జిల్లా స్థాయి చదరంగం పోటీలకు ఎంపికయ్యాడు. కొవ్వూరులో జరిగిన 69వ స్కూల్ గేమ్స్ చదరంగం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తా చాటాడు. అలాగే అండర్-14 విభాగంలో పాల్గొన్న తపస్విరెడ్డిని పలువురు పట్టణ ప్రముఖులు అభినందించారు.

ఆశ్రయ ఫౌండేషన్‌కు వాటర్ డిస్పెన్సరీ బహూకరణ



బహూకరిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆశ్రయ ఫౌండేషన్‌కు పట్టణానికి చెందిన కంటమణి రామకిషోర్ సౌజన్యంతో దంతులూరి నవ్య, దీపికలు శుక్రవారం వాటర్ డిస్పెన్సరీ, మిక్సీ, ఐదు కుర్చీలను బహూకరించారు. లయన్స్ క్లబ్ సభ్యులు పి. జయరాజు, యనమదల సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి రామకృష్ణ, కంటమణి కిషోర్ పాల్గొన్నారు.

పోలీస్ చట్టాలపై అవగాహన తరగతులు



వ్యాస రచన పోటీలను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం కరిబండి కళాశాలలో ఎస్ఐ రామకృష్ణ విద్యార్థులకు పోలీస్ చట్టాలపై అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల వల్ల జరిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ ఆదిత్యశ్రీనివాస్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే



మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత

కొవ్వూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాలేజీల్లో చదివేటప్పుడు సీనియర్ విద్యార్థుల నుంచి జూనియర్ విద్యార్థులు మంచి విషయాలు నేర్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత అన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఉత్సాహంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనుభవం కలిగిన అధ్యాపకుల సేవలు వినియోగించుకుని ఉన్నతమైన భవిష్యత్‌ను పొందాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కె. సూర్యనారాయణ, వీ. శ్రీనివాసరావు, పుష్పాంజలి, భూపతిరాయలు, సాదిక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆధార్ క్యాంపులు

తాళ్లపూడి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి, మలకపల్లిలోని విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి తెలిపారు. మాంటిస్సోరీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, మలకపల్లిలోని రవీంద్రభారతి పాఠశాలల్లో క్యాంపులు ఈనెల 31వ తారీఖు వరకూ నిర్వహిస్తారని చెప్పారు. తాళ్లపూడిలో డిజిటల్ అసిస్టెంట్ ఏ.భవానీ ప్రశాంత్, మలకపల్లిలో డిజిటల్ అసిస్టెంట్ కేఎస్‌వీ రమణ, సిబ్బంది హాజరై ఆధార్ క్యాంపులు నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



చీపురుగూడెం యువతకు వాలీబాల్, నెట్ అందిస్తున్న టీడీపీ నేత పెద్ద రామన్న

నల్లజర్ల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : యువత క్రీడల్లో రాణించాలని చీపురుగూడెం గ్రామ టీడీపీ అధ్యక్షుడు చెల్లు పెద్దరామన్న అన్నా రు.శుక్రవారం గ్రామంలోని తన సొంత స్థలంలో యువత ఆడుకోవడానికి వాలీబాల్ నెట్‌ను ఏర్పాటు చేశారు. పెద్దరామన్న మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం కలుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయుడు, గాలింకి గంగాధర్, జాన్, చెల్లు సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి

అధికారుల పర్యటన

● ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ

పెరవలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కానూరు, నడిపల్లి గ్రామాల పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా గతం నుంచి కోళ్ల ఫారాలు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంతం కలుషితమవుతోందని నడిపల్లికి చెందిన ఈడ్పుగంటి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు శుక్రవారం ఆయా గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. అలాగే ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన కోళ్ల ఫారాలు వల్ల ఈగలు, దోమలు విపరీతంగా వృద్ధి చెందుతూ దుర్గంధం వ్యాపిస్తోందని ఆయన ఫిర్యాదు చేశాడు. దీనికి స్పందించిన అధికారులు తొలుత కొవ్వూరు ఆర్‌డీవో ఆఫీసులో సమావేశమైన అనంతరం ఇక్కడకి వచ్చి పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి అభ్యంతరాలున్నా .. శనివారం సాయంత్రం లోగా తమకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాణీసుస్మిత, శాస్త్రవేత్త వరలక్ష్మి, చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాజశేఖర్, సీనియర్ ఎన్విరాన్‌మెంట్ అధికారి శాస్త్రి, శంకరరావు, జీ. శ్రీనివాసరావు, తహశీల్దార్ నిరంజన్ ఉన్నారు.

ఘనంగా రామారావు పుట్టినరోజు వేడుకలు



కేకు కట్ చేస్తున్న రామారావు, తదితరులు

దేవరపల్లి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు పుట్టినరోజు వేడుకను సొసైటీ కార్యాలయంలో అభిమానులు, సొసైటీ ఉద్యోగులు, పార్టీ నాయకుల సమక్షంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అనంతరం కేకును కట్ చేశారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు సీతారత్నసూర్యకుమారి, తంగెళ్ల శ్రీనివాస్, సొసైటీ సీఈవో కల్లూరి శ్రీనివాస్‌శర్మ, సిబ్బంది గుడ్ల వెంకటేశ్వరరావు, కవల రమేశ్, కుంజర్ల రమేశ్, అంకోలు మణికంఠ, టీడీపీ నాయకులు పిన్నమనేని నవీన్, నందిగం శ్రీధర్, గద్దే రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి గ్రంథాలు అందజేత

ద్వారకాతిరుమల మండలం ఐఎస్. జగన్నాథపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయ విశిష్టత వైభవంతో రచించిన పుస్తకాలను శుక్రవారం స్థానిక షిరిడీ సాయిబాబా ఆలయంలో సొసైటీ చైర్‌పర్సన్ ఉప్పులూరి రామారావు మహిళా భక్తులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కవల సీతారత్న సూర్యకుమారి, తంగెళ్ల శ్రీనివాస్, టీడీపీ నేత గద్దే రమాదేవి, ఆలయ అర్చకులు అగ్నిహోత్రం సత్యనారాయణ ఆచార్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండ

» కార్మిక శాఖ మంత్రి సుభాష్

» ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్లతో కలిసి రాయవరం మృతుల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

» ఒక్కొక్కరికి రూ.15 లక్షల పరిహారం

» యజమాని తరపున రూ.2.50 లక్షల చొప్పున అందజేత



కొమరిపాలెంలో మృతుల కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, వేగుళ్ల

అనపర్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విపత్తులు జరిగి ప్రాణనష్టం వాటిల్లినపుడు పరిహారం అందించడంతో ప్రభుత్వం ముందు వరుసలో నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఈనెల 8న బిక్కవోలు మండలం కొమరిపాలెం, రాయవరం మండలం వి.సావరం గ్రామాల సరిహద్దుల్లో గణపతి గ్రాండ్ ఫైర్ వర్క్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు శుక్రవారం కొమరిపాలెంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా పరిహారం అందజేశారు. ముందుగా మృతుల కుటుంబాలకు నివాళులర్పించి సభను ప్రారంభించారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అనపర్తికి చెందిన చిట్టూరి శ్యామల, పెంకే శేషారత్నం,కురుపూడి జ్యోతి, చిట్టూరి యామిని, కొమరిపాలేనికి చెందిన వెలుగుబంట్ల సత్యనారాయణ, రమణ, వాసంశెట్టి విజయలక్ష్మి, కె.సదానంద్, లింగం వెంకటకృష్ణపాకా అరుణ కుటుంబాలకు కార్మిక శాఖ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షలు, యజమాని వెలుగుబంట్ల సత్యనారాయణ తరపున ఆయన కుమారుడు ఒక్కొక్క కుటుంబానికి రూ.2.50 లక్షల పరిహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంఘటన దురదృష్టకరమన్నారు. ప్రతిపక్ష నాయకులు ఈ ఘటనను రాజకీయం చేయాలని చూసి, పలు ఆరోపణలు చేశారని అందుకే ప్రభుత్వం ద్విసభ్య కమిటీని నియమించి నిజానిజాలను తేల్చిందని అన్నారు. దీంతో వైసీపీ మాటలు అసత్యాలని తేలిందన్నారు. బాధితుల్లో 8 మందికి టీడీపీ సభ్యత్వాలు ఉన్నాయని వారికి త్వరలో పార్టీ తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.5 లక్షల బీమా అందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొన్నామన్నారు. పరిహారంపై అసత్య ప్రచారాలు చేసిన మాజీ ఎమ్మెల్యే 2019 ఎన్నికల్లో విజయోత్సవంలో జరిగిన బాణసంచా ప్రమాదంలో నలుగురు చనిపోతే వారికి పరిహారం మాట అటుంచి పరామర్శకే నెలల సమయం పట్టిందన్నారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్, అనపర్తి జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, రావాడ నాగు, కర్రి శేషారత్నం, బేరా వేణ మ్మ, కర్రి సత్యగౌరి, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

రూ.2.50 కోట్లతో విశ్రాంత షెడ్డు ... సత్యదేవుడి భక్తులకు అంకితం

అన్నవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ప్రముఖ ఫార్మా షూటికల్ సంస్థ లారస్ ల్యాబ్ రూ2.50 కోట్లతో నిర్మించిన విశ్రాం త షెడ్డును శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రారంభించగా దీనిని భక్తులకు అంకితమిస్తున్నట్టు సంస్థ సీఈవో చావా సత్యనారాయణ పేర్కొన్నారు. భక్తులు అధికంగా ఉండే పశ్చిమ రాజగోపురం ఎదురుగా దీనిని నిర్మించారు. రత్నగిరికి విచ్చేసే సాధారణ భక్తులు ఎండకు ఎండి, వర్షానికి తడుస్తూ అనేక ఇబ్బందులు ఎదుర్కొనేవారు. 2023లో దీనిని నిర్మించేందుకు సంస్థ ముందుకొచ్చినా సాంకేతిక కారణాలతో నిలిచిపోయింది. ఇటీవల అన్నవరం దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈవో వీర్ల సుబ్బారావు మరోసారి సంస్థ ప్రతినిధులతో చర్చించి కార్తీక మాసం ప్రారంభానికి అందుబాటులోకి వచ్చేలా ప్రయత్నించారు. ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ లారస్ సంస్థ దాతృత్వాన్ని కొనియాడారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆలయాన్ని అన్నివిధాలా అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, సర్పంచ్ శెట్టిబత్తుల కుమార్‌రాజా పాల్గొన్నారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్ట్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ప్రాంతాల్లో బైక్‌లు దొంగతనం చేస్తున్న ఇద్దరిని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్ వద్ద మమత రెస్టారెంట్ బయట పార్క్ చేసిన ఏపీ05 బీటీ 4855 నెంబరు గల బైక్‌ను ఈనెల 16న దొంగలు అపహరించారని బాధితుడు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఈనెల 23న వారికి వచ్చిన సమాచారం మేరకు ఈ బైక్ దొంగిలించుకుపోయిన ధవళేశ్వరం కాంచర లైన్‌కు చెందిన కొంకోట గనిరాజు అలియాస్ గని, సిర్రరాజా నిర్మలప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగిలించిన ఏడు బైక్‌లు, టూటౌన్ పరిధిలో అపహరించిన ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు.

పేకాడుతున్న 13 మంది అరెస్ట్

కడియం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తూ ర్పుగోదావరి జిల్లా కడియం మండలం వీరవరంలో పేకాడుతున్నట్టు సమాచారం రావడ ంతో సీఐ ఎ.వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్ఐ బి.దుర్గాప్రసాద్ దాడి చేశారు. వీరవరం లో బి.సుధీర్ నర్సరీ టైల్‌షెడ్‌లో పేకాడుతున్న 13 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.13,050 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

పోలీసులకు చిక్కిన అంతర్‌రాష్ట్ర గజదొంగ

అల్లవరం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మొగళ్లమూరుకు చెందిన అంతర్‌రాష్ట్ర గజదొంగ చింతా గణేష్ అరెస్టు అయ్యాడు. ఇతడిపై పలు పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. భక్తులు ఆలయాల వద్ద కారులు ఆపి ముందు జాగ్రత్తగా తమ బంగారు ఆభరణాలను తీసి కార్లలో పెట్టి లాక్ వేస్తుంటారు. అయితే ఆలయాలకు వెళ్లే వారిని గణేష్ టార్గెట్ చేస్తుంటాడు. చాకచక్యంగా కార్ల ఫ్రంట్ గ్లాస్ దింపి బంగారు వస్తువులతో పరారవుతుంటాడు.